
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
ఆదివారం 6 ఏప్రిల్ 2025



పరిహారంతోనే పంచాయితీ..

కొలిక్కిరాని మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణ

- నిర్మాణానికి 253 ఎకరాలు అవసరమని అంచనా
- సేకరణకు రూ.205కోట్లు విడుదల చేసిన సర్కారు
- రైతులతో ప్రజాప్రతినిధులు, అధికారుల సమావేశం
- ఎకరాకు రూ.2కోట్లకు రైతుల డిమాండ్.. రూ.60లక్షలలోపే అధికారుల మొగ్గు
- కొలిక్కిరాకపోవడంతో రైతుల వెనుకంజ
- ఒకే గ్రామంలోనే భూముల విలువలో తేడాలు ఉండడంతో ఆగ్రహం
- రెవెన్యూ అధికారులు మార్కెట్ ధర పెంచలేదని రైతుల ఆగ్రహం

7



దేవుడు వరమిచ్చినా.. పూజారి కనికరించని చందంగా ఉంది మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణం అంశం. ఓరుగల్లు వాసుల చిరకాల వాంఛ అయిన విమానయానం దరిచేరిందనుకున్న తరుణంలో ఇతర అంశాలు అడ్డుపడుతుండడం నిరాశను కలిగిస్తోంది. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. అందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు వేగంగా చేపట్టారు. ఇందులో ప్రధానంగా భూసేకరణ సవాల్‌గా పరిణమించింది. ఇంతకు ముందు మామునూరులో ఎయిర్‌పోర్టు ఆధీనంలో ఉన్న సుమారు 694ఎకరాలకు తోడుగా మరో 253 ఎకరాల భూమి కావాల్సి వచ్చింది. భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.205కోట్లను విడుదల చేసింది. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులు మామునూరు పరిసర గ్రామాల రైతులతో చర్చించారు. భూమి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. అయితే రైతులు భూమి ఇవ్వడానికి కొన్ని షరతులు పెట్టారు. తొలుత భూమికి బదులు భూమి ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. కుదరదని అధికారులు చెప్పడంతో ఎకరాకు రూ.2కోట్ల వరకు చెల్లించాలని పట్టుబట్టారు. అయితే ఎకరాకు రూ.30లక్షలు చెల్లిస్తామని అధికారులు చెప్పగా రైతులు ఒప్పుకోలేదు. ప్రాంతాన్ని బట్టి రూ.60లక్షలు చెల్లిస్తామని అధికారులు చెప్పగా రైతులు సమ్మతించలేదు. పరిహారం విషయం కొలిక్కిరాకపోవడంతో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వ పెద్దలు స్పందించి పరిష్కరించాలని నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

చిరస్మరణీయుడు జగ్జీవన్ రామ్

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- ఘనంగా 118వ జయంతి వేడుకలు



బాబు జగ్జీవన్ రామ్ జయంతి సభలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని వరంగల్ పశ్చి మ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివా రం హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి ఉత్సవాన్ని హనుమకొండ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్. నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో పాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు.

ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ చరిత్రను సమాజంలోని ప్రతీ ఒక్కరు స్మరించుకోవల్సిన అవసరం ఉందన్నారు. ఆనాటి కుల వివక్షపై పోరాటం చేసిన గొప్ప చరిత్ర ఆయనదని అన్నారు. జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ వంటి మహనీయుల జీవితాలు, చేసిన త్యాగాలు ఎంతో గొప్పవని కొనియాడారు. నగరంలో జగ్జీవన్‌రాం విగ్రహాన్ని నెలకొల్పడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్. అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ వంటి మహనీయుల త్యాగాల స్ఫూర్తితోనే తాను ఈ స్థాయికి ఎదిగానని అన్నారు. జగ్జీవన్‌రామ్ జీవించినంత కాలం బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన మహనీయుడని పేర్కొన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ ఒక చిన్న కుటుంబం నుంచి దేశ ఉప ప్రధాని స్థాయికి ఎదిగారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వ పరంగా అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆధునిక పరిజ్ఞానం నైపుణ్యాలు, పెంపొందించే విధంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. నైపుణ్య శిక్షణ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని, జిల్లాలోని పరకాల నియోజక వర్గ పరిధిలో స్కిల్ డెవలప్‌మెంట్ చేసినట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. అజీజ్‌ఖాన్, జీడబ్ల్యూఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, హనుమకొండ ఆర్డీవో రమేష్‌రాథోడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కొంగర జగన్మోహన్, ఉత్సవ కమిటీ చైర్మన్ అంకేశ్వరపు రాంచందర్‌రావు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పుట్ట రవి, ఎమ్మార్పీఎస్ జాతీయ నేత మంద కుమార్ మాదిగ, టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల భిక్షపతి, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు, మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా, డీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమార్, వివిధ ప్రజా సంఘాల నాయకులుపాల్గొన్నారు. మగ్ధుం చేసిన వ్యాఖ్యానం ఆకట్టుకోగా తెలంగాణ సాంస్కృతిక కళాకారులు ఆలాపించిన పాటలు ఆద్యంతం అలరించాయి.

రాష్ట్రంలో మరో 15 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే..

- సన్న బియ్యం పంపిణీకి చట్ట భద్రత కల్పించాం..
- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- తూర్పులో సన్న బియ్యం పంపిణీ ప్రారంభం



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి కొండా సురేఖ

గిర్మాజీపేట,ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజోపయోగ కార్యక్రమాలతో కాంగ్రెస్ ప్రభుత్వం మరో 15ఏళ్ల రాష్ట్రంలో అధికారంలో ఉంటుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆమె వరంగల్ గోవిందరాజుల గుట్ట ప్రాంతంలో సన్న బియ్యం పంపిణీని లాంచనంగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పేద ప్రజలకు బియ్యం అందించాలనే కార్యక్రమాన్ని తొలుత ప్రారంభించింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి రుపాయిన్నరకు కిలో బియ్యం పథకాన్ని అమలుచేశారని మంత్రి గుర్తు చేశారు. పేదలకు బియ్యం అందించేందుకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఆహార భద్రత చట్టాన్ని తీసుకు వస్తే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాన్ని ఉగాది నుంచి అమలు చేస్తూ తెలంగాణ పేదలకు సన్న బియ్యం ఉచితంగా ఇస్తున్నారని అన్నారు. సన్న బియ్యం పంపిణీ పథకానికి చట్టభద్రత కల్పించామని, ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఈ పథకాన్ని కొనసాగించాల్సిందేనని స్పష్టం చేశారు. నాడు కేసీఆర్ దొడ్డు బియ్యాన్ని పాలిష్ చేసి హాస్టళ్లకు పంపిణీ చేస్తే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తోందన్నారు. అంతేగా కుండా విదేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నామని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లకు ఉచిత విద్యుత్తు, రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఆర్థిక సహాయం అందిస్తూ తమ ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతుంటే.. బీఆర్ఎస్ పార్టీ కడుపుమంటతో తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి సురేఖ మండిపడ్డారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారిస్తే రేవంత్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా ఆదాయం పెంచుతూ, అప్పులు తీరుస్తూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. సన్న బియ్యం పంపిణీ చేస్తుంటే పేదల కళ్లల్లో సంతోషం కనిపిస్తోందని అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పేదలందరికి సన్న బియ్యం అందించే బాధ్యత రేషన్ డీలర్లదేనని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ అహ్మద్, కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, గోపాల నవీన్‌రాజ్, జారతి రమేష్, చింతాకుల సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు డప్పు చప్పుళ్లతో మంత్రి సురేఖకుస్వాగతం పలికారు.

శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి..

- నేడు శ్రీ జానకీరాఘవుడి కల్యాణోత్సవం
- ముస్తాబైన రామ, హనుమ ఆలయాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవాదాయ శాఖ అధికారులు
- పలు ఆలయాల్లో సంప్రదాయంగా ఎదుర్కోలు కార్యక్రమం



రెవెన్యూకాలనీలోని రామాలయంలో కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చైత్రశుద్ధ నవమి ఆదివారం జిల్లా అంతటా శ్రీరామ నవమి వేడుకలను జరుపుకునేందుకు ప్రజలంతా సన్నద్ధమయ్యారు. శ్రీరామ నవమి వేళ శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్సవాన్ని వాడవాడలా అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఈసారి అనేక ఉత్సవ కమిటీలు సీతారాములోరి పెళ్లికి కల్యాణ పత్రికలను ముద్రించి సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం నిర్వహించారు. దేవుడి పెళ్లికి ఊరి పెద్దలే ప్రముఖులై నిర్వహించనున్న క్రమంలో ప్రతీ ఒక్కరు రాములోరి పెళ్లి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆరుబయట కల్యాణోత్సవాలు నిర్వహించే ఆలయాల ముందు భక్తులకు ఇబ్బందులు కలగకుండా చలువ పందిళ్లు, మంచినీటి, మజ్జిగ వసతిని ఏర్పాటు చేశారు. హనుమాన్, రామాలయాలతోపాటు ఇతర అన్ని వైష్ణవ ఆలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు భద్రాచలంలో జరిగే 12 గంటల సమయంలో అభిజిత్ లగ్న సుమూర్తంలో జరగనున్నాయి. ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం జరగనున్న నేపథ్యంలో శనివారం రాత్రి అనేక ప్రాంతాల్లో సంప్రదాయంగా సీతారాముల ఎదుర్కోలు ఉత్సవాలను మంగళవాయిద్యాల నడుమ నిర్వహించడం విశేషం.

వేయిస్తంభాల ఆలయంలో..

వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో వైభవంగా జరుగుతున్న సీతారామ వసంత నవరాత్రి వేడుకల సందర్భంగా శనివారం సీతారాముల ఎదుర్కోలును వైభవంగా నిర్వహించారు. కృష్ణ యజుర్వేద పండితుడు గుడిమల్ల విజయ కుమారాచార్యులు, ఆలయ వేద పండితులు మణిశర్మ, ప్రణవ్‌ల వేద మంత్రాల మధ్య గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఎదుర్కోలు వేడుకలు జరిగాయి. అంతకుముందు ధ్వజారోహనం చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయంలో నిత్య మహాసుదర్శన హోమం కూడా జరిగింది. ఈవో అనిల్ కుమార్ పర్యవేక్షించారు. ఆదివారం పెద్ద ఎత్తున కల్యాణోత్సవం నిర్వహించేందుకు అనంతరం భక్తులకు ప్రసాద వితరణకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో చెప్పారు.

రెవెన్యూ రామాలయంలో..

రెవెన్యూ కాలనీలోని సీతారామ ఆలయంలో ఈసారి 40వ కల్యాణ బ్రహ్మోత్సవాలను నిర్వహింపజేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ భూసూరి సాంబమూర్తి, వైస్‌చైర్మన్ రామారావు, సెక్రటరీ ప్రసాద్‌లు చెప్పారు. ఆలయాన్ని మరింత ఆధునీకరింపజేసిన నేపథ్యంలో మొట్టమొదటిసారిగా విశాల మైదానంలో ఆరుబయట కల్యాణోత్సవాన్ని నిర్వహింపజేస్తున్నామన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆరవల్ల శ్రీకాంతాచార్య ఆధ్వర్యంలో కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సంప్రదాయంగా ముత్యాల తలంబ్రాలను తీసుకొచ్చేందుకు జిల్లా కలెక్టర్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఇతర అధికార, అనధికారులను ఆహ్వానించినట్లు నిర్వాహకులు చెప్పారు.

పలు ఆలయాల్లో..

హనుమకొండ రాగన్నదర్వాజలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంగా ప్రసిద్ధిచెందిన చిన్న కోవెలలో పెద్దఎత్తున కల్యాణోత్సవాన్ని

మిగతా 8వ పేజీలో

పేదోళ్లకు ఒక లెక్క పెద్దోళ్లకు మరో లెక్క

- రాజాజీనగర్ పెద్ద నాలా నిర్మాణంలో అవకతవకలు
- బడా వ్యక్తి కోసం నాలా ప్లానింగ్ మార్పు
- నాలా మధ్యలో పిల్లర్లు వేసి రోడ్డు నిర్మాణం
- నిబంధనలకు విరుద్ధంగా ప్రొటెక్షన్ వాల్
- స్మార్ట్ సిటీ నిధులతో నాసిరకం పనులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న 52, 53 డివిజన్ల ప్రజలు



అక్రమ కట్టడాలు నిలిపి వేయాలని డిమాండ్ చేస్తున్న ప్రజలు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలోని 52, 53 రెండు డివిజన్ల పరిధిలోని హనుమకొండ రాజాజీనగర్ నుంచి పెగడపెల్లి డబ్బాల పెద్ద మోరి వరకు నిర్మిస్తున్న నాలా పనుల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. స్మార్ట్‌సిటీ నిధులతో చేపట్టిన ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం, సిల్ట్, గుర్రపు డెక్క తొలగింపునకు టెండర్లు పిలువగా ఇద్దరు బడా కాంట్రాక్టర్లు రూ.50 కోట్లకు పనులు దక్కించుకున్నారు. మూడేళ్లుగా జరుగుతున్న పనుల్లో నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తుల ముడుపులకు ఆశపడి బల్దియా అధికారులు నాలా ప్లాన్‌నే మార్చి నిర్మాణాలు జరుపుతున్నారని ఆరోపిస్తున్నారు. శనివారం హనుమకొండ రాజాజీనగర్ కాలనీవాసులు అక్రమ కట్టడాలను నిలిపి వేయాలని అక్కడి బ్రిడ్జిపై నిరసన వ్యక్తం చేసి అక్రమ కట్టడాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు.

పెద్దోళ్లకు వెన్నుదన్నుగా..

హనుమకొండ పెద్దమోరి పెద్దనాలా చుట్టుపక్కల భూమి కబ్జాలను నియంత్రించేందుకు బల్దియా అధికారులు పూనుకున్నారు. నాలా ప్రాంతాలైన వడ్డెపల్లి, సమ్మయ్యనగర్, రాంనగర్, లష్కర్‌సింగారం, రాజాజీనగర్, నయీంనగర్, బొక్కలగడ్డ, ఈదులవాగు నాలాస్థలంతో పాటు బఫర్ జోన్‌ను అక్రమార్కులు ఆక్రమించి శాశ్వతంగా ఇళ్లు, ప్రహరీలు నిర్మించుకున్నారు. దీంతో వంద మీటర్ల వెడల్పు కలిగిన నాలా కుచించుకుపోయింది. ఈ క్రమంలో మూడేళ్ల కిందట భారీ వర్షాలు కురిసి నీరు సరిగా ప్రవహించక సమీపం కాలనీల ఇండ్లలోకి మురుగునీరు చేరి ప్రజలు అవస్థలు పడ్డారు. దీన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు సీరియస్‌గా తీసుకుని సమ్మయ్యనగర్ నుంచి హనుమాన్‌నగర్ కేసీ కెనాల్ వరకు అక్రమ కట్టడాలను కొంత మేరకు తొలగించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాలా 80 ఫీట్ల వెడల్పు ఉండాలి. కానీ కొన్ని చోట్ల 30 ఫీట్లు, మరికొన్ని చోట్ల 50. 60. 70 ఫీట్ల వెడల్పును నిర్ధారించారు. అయితే ఈ బఫర్ జోన్‌లో ఉన్న పేదల ఇండ్లను మాత్రమే కూల్చి పెద్దలకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నట్లు తెలుస్తోంది. ఈ నాలా పరివాహక ప్రాంతంలో పేదవారికి ఒక న్యాయం.. పెద్ద వారికి ఒక న్యాయం చేశారని అధికారులు తీరుపై ప్రజలు మండి పడుతున్నారు. కొన్నిచోట్ల 60 ఫీట్ల వెడల్పు తీయగా.. మరి కొన్నిచోట్ల ముడుపులు, ప్రజాప్రతినిధులు ఆదేశాలు, కోర్టు కేసులో ఉన్న పత్రాలు చూపించిన వారిని వదిలివేసినట్లు తెలుస్తోంది.

నాసిరకం నిర్మాణం

సుమారు 2 కిలోమీటర్ల వరకు నిర్మిస్తున్న పెద్ద మోరి పెద్ద నాలా ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం పనులు నాసిరకంగా చేపడుతున్నట్టు ప్రజలు ఆరోపిస్తున్నారు. గోడ నిర్మాణంలో సిమెంట్ తక్కువగా ఉపయోగిస్తూ ఇసుక, చిప్స్ ఎక్కువగా వాడుతూ పనులు చేస్తున్నారని అంటున్నారు. పనులను నిత్యం పర్యవేక్షించవలసిన బల్దియా ఇంజనీరింగ్ అధికారులు, క్వాలిటీ కంట్రోల్ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే నాసిరకం పనులు జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే బొక్కలగడ్డ ప్రాంతంలో ప్రొటెక్షన్‌వాల్ నాసిరకంగా నిర్మించడం వల్ల కిందికి వంగిపోయిందని భారీ వర్షాలు కురిస్తే ఇబ్బందే అని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా రాజాజీనగర్ వద్ద నాలా మధ్యలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలిని వేసి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



నాలా మధ్యలో పిల్లర్లు వేసి రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్



అడ్డదిడ్డంగా నిర్మిస్తున్న నాలా ప్రొటెక్షన్ గోడ

ఇష్టారీతిన బ్రిడ్జి నిర్మాణం

హనుమకొండ నగరంలో స్మార్ట్‌సిటీ నిధులతో జవహర్‌కాలనీ, రాజాజీనగర్, నయీంనగర్ పెద్దమోరిపై కొత్తగా బ్రిడ్జిలు నిర్మించారు. కానీ రాజాజీనగర్‌లో నిర్మించిన బ్రిడ్జి నిర్మాణ పనులు విచిత్రంగా ఉన్నాయని అక్కడి ప్రజలు విమర్శిస్తున్నారు. రాజాజీనగర్ బ్రిడ్జి పక్కన ఓ బడా వ్యాపారి ఇల్లు బఫర్‌జోన్‌లో ఉన్నా.. అతడి గోడను ఏ మాత్రం ముట్టుకోకపోవడంతో పాటు అతడి కోసం బల్దియా రూ.1.50కోట్లు ఖర్చు చేసి నాలా మధ్యలో 15 పిల్లర్లు వేసి రహదారి నిర్మించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ కట్టడాలను తొలగించాల్సిన అధికారులు.. నలా ప్లానింగ్ (నక్ష) మార్చి మరీ మురికినీటి ప్రవాహానికి అడ్డుగా పిల్లర్లు నిర్మిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

గతంలో వర్షాలతో ఆర్థికంగా నష్టపోయాం..

సుధాకర్, లష్కర్ సింగారం

గతంలో కురిసిన వర్షాల వల్ల నాలా నుంచి నీరు పరిగా ప్రవహించక ఇళ్లల్లోకి మురికి నీరు చేరుకున్నాయి. ఇంట్లో నిత్యావసర సరుకులు నీటితో తడిచిపోయి ఒక్కో కుటుంబానికి రూ.5 నుంచి రూ.10లక్షల ఖర్చు అయింది. అధికారులు కాలువ నిర్మాణం చేస్తున్నా నాలా మధ్యలో పిల్లర్లు పోయడం వల్ల తిరిగి అదే పరిస్థితి వస్తుంది. కొందరి స్వలాభం కోసం సామాన్యులను ఇబ్బంది పెట్టడం సరికాదు.

నాలుగు కాలనీలు జలమయమయ్యాయి..

టి.నాగయ్య, రాజాజీనగర్ కాలనీవాసుడు

గతంలో వర్షాల కారణంగా రాజాజీనగర్, రాంనగర్, లష్కర్‌సింగారం, నయీంనగర్ ప్రాంతాలు సుమారు కిలోమీటరు దూరంలో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ జీవించారు. అధికారులు స్మార్ట్‌సిటీ నిధులు కేటాయించినా అవి కొందరు వ్యక్తుల సౌకర్యార్థం కోసం వినియోగిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో నాలా సరిగా లేకపోవడం వల్ల చాలా సమస్యలు ఎదుర్కొంటున్నాం. నాలా మధ్యలో నిర్మించే పిల్లర్లను వెంటనే తొలగించి కాలువ పనులు సక్రమంగా చేపట్టాలి.

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమలు

- కమిషనరేట్ పరిధిలో నెల రోజుల పాటు
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఆదివారం నుంచి నెల రోజుల పాటు సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసుల అనుమతులు లేకుండా మీటింగ్, ర్యాలీలు, ఊరేగింపులను నిర్వహించడం నిషేధించినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని తెలిపారు. వృద్ధులు, రోగులతో పాటు విద్యార్థుల చదువులను దృష్టిలో పెట్టుకొని, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడంలో భాగంగా డీజే సౌండ్స్ వినియోగించడంపై నిషేధాన్ని కొనసాగిస్తామన్నారు. ఎవరైనా తప్పని పరిస్థితులలో మైక్‌లను ఏర్పాటు చేయాలనుకుంటే ఏసీపీ నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించుకోవాలన్నారు. ఆస్పత్రులు, విద్యాలయాలకు 100 మీటర్ల పరిధిలో మైక్‌లను ఏర్పాటు చేయరాదని, ఇది ఏప్రిల్ 6 నుంచి మే 5వ తేదీ వరకు అమలులో ఉంటుందన్నారు. ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలియజేశారు.

రామప్ప ఆలయ సన్నిధిలో సీపీ



రామప్ప విశిష్టతను గైడ్ ద్వారా తెలుసుకుంటున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

వెంకటాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ కుటుంబ సమేతంగా శనివారం సందర్శించారు. ఈసందర్భంగా అర్చకులు, అధికారులు ఆయన్ను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న సీపీ ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు పట్టువస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన శిల్పకళా సంపదను వీక్షించి అబ్బురపడ్డారు. ఆలయ విశిష్టత, చరిత్ర గురించి గైడ్‌లను అడిగి తెలుసుకు న్నారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని బోటులో విహరించారు.

రెండో వివాహం కావడం లేదని..

- ఉపాధ్యాయుడు రైలు కిందపడి ఆత్మహత్య
- మృతుడిది హనుమకొండ జిల్లా పులిగిల్ల గ్రామం



వల్లాగి కిరణ్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రెండో వివాహం జరగడం లేదని మనస్తాపం చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మద్యానికి బానిసై.. శనివారం ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా నడికూడ మండలం పులిగిల్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు (స్కూల్ అసిస్టెంట్) వల్లాగి కిరణ్ (45) జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండ లంలోని ఉప్పుగల్లు పాఠశాలకు ఆరు నెలల క్రితం బదిలీపై వెళ్లారు. 2009లో పాలకుర్తి మండల పరిధిలోని పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరిన కిరణ్, మేనమామ కుమార్తెను 2011లో వివాహం చేసుకున్నాడు. ఆరు నెలల వ్యవధిలోనే విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి తల్లి సుశీలతో కలిసి పాలకుర్తిలో కిరాయి ఇంట్లో ఉంటూ ఉద్యోగం చేసుకుంటున్నాడు. తండ్రి గతంలోనే చనిపోయాడు.

కాగా, రెండో పెళ్లి కోసం కిరణ్ ప్రయత్నిస్తున్నా సంబంధం కుదరడం లేదు. దాంతో మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో కిరణ్ శనివారం తెల్లవారుజామున సికింద్రాబాద్ నుంచి కాజీపేట వైపు వెళ్తున్న గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, పీసీ నరేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో పోస్టుమాస్టర్ మృతి

- సంపు మోటార్ సరి చేస్తుండగా ప్రమాదం
- మృతుడిది ఆంధ్రప్రదేశ్‌లోని వదర్లపాడు గ్రామం



నాగదుర్గ బాలాజీ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పోస్టుమాస్టర్ మృతి చెందిన ఘటన శనివారం జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం మీదికొండలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కృష్ణా జిల్లా కైకలూరు మండలం వదర్లపాడుకు చెందిన బాలాజీ(27) తపాలాశాఖలో ఉద్యోగం రాగా మీదికొండలో ఆరు నెలల క్రితం బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా విధుల్లో చేరాడు. ఘన్‌పూర్ పట్టణంలోని తిరుమలనాథస్వామి కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. స్నానం చేయడానికి వాటర్ సంపులోని విద్యుత్ మోటార్ ఆన్ చేసి నీళ్లు తోడుకునే ప్రయత్నం చేయగా నీళ్లు రాలేదు. దాంతో మోటార్ రిపేరు వచ్చి ఉంటుందని భావించిన బాలాజీ, స్విచ్‌ఆఫ్ చేయకుండానే సంపు వద్దకు వెళ్లి మోటార్‌ను బయటకు తీసి పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించా, అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతదేహాన్ని పోలీసులు జనగామ ఏరియా ఆస్పత్రికి పంపించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్టు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట పీఎస్ పరిధిలో అన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను శనివారం అరెస్టు చేసి రూ.20వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. కాగా, బెట్టింగ్‌లకు పాల్పడుతున్న మరో నలుగురు వ్యక్తులు పరారీలో ఉండగా, పట్టుబడ్డ నలుగురు వ్యక్తుల నుంచి నగదును స్థానిక పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు.

ఆత్మకూర్ పీఎస్ పరిధిలో..

ఆత్మకూర్ పీఎస్ పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో వెబ్‌సైట్ ద్వారా బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి రూ.42,100 సీజ్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. కాగా, ఈ బెట్టింగ్‌లో పాల్గొన్న నల్లగొండకు చెందిన మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారన్నారు.

పోతన హాస్టల్‌ను అల్లుకున్న పొదలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో పోతన మహిళ హాస్టల్‌లో గడ్డి పొదలు ఏపుగా పెరిగి బిల్డింగ్‌ను చుట్టాయి. పోతన హాస్టల్ వెనుక వైపు బాత్‌రూమ్, టాయిలెట్స్ వైపు ఏపుగా పెరిగాయి. ఆ పొదల్లోంచి పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో ఉండే పాములు, తేళ్లు ఇతర విష పురుగులు హాస్టల్‌లోకి వస్తున్నాయి. హాస్టల్ అధికారులు తక్షణమే స్పందించి పోతన వద్ద ఏపుగా పెరిగిన పొదలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే కేయూ క్యాంపస్‌లోని బాటనీ, జువాలజీ విభాగం ఎదురుగా విద్యుత్ స్తంభాల వద్ద వైర్లు బయటకు రావడంతో అటుగా వెళ్తున్న విద్యార్థులకు విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని విద్యార్థులు, అధికారులు, అధ్యాపకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ వైర్లను సరి చేసి ప్రమాదాలు జరుగకుండా చూడాలని అధ్యాపకులు, విద్యార్థులు కోరుతున్నారు.



తొర్రూరులో కొత్తతరహాలో దొంగతనం

- కూలి పనులకంటూ బైక్ ఎక్కించుకొని బంగారు ఆభరణాలు చోరీ
- సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసుల విచారణ
- మానుకోట జిల్లాలో ఘటన



తొర్రూరు నుంచి ద్విచక్ర వాహనంపై కూలీలను తీసుకెళ్తున్న దుండగుడు

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : కూలి పనులకు తీసుకెళ్తామంటూ బైక్‌పై వచ్చిన వ్యక్తి.. ఓ మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారం ఆభరణాలు అపహరించుకుపోయాడు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో శనివారం జరిగిన ఈ కొత్తతరహా దొంగతనం కలకలం రేపుతోంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. తొర్రూరులోని అన్నారం రోడ్డులో ఉన్న కూలీల అడ్డా వద్దకు పట్టణ కేంద్రానికి చెందిన మూగ మహిళా కూలీ గూబ కొమురమ్మ, చింతలపల్లి గ్రామ శివారు కొమ్మనపల్లి గ్రామానికి చెందిన భూక్య సునీత పనుల కోసం వచ్చారు. గుర్తు తెలియని ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి ఇద్దరు మహిళా కూలీలు కావాలనడంతో కొమురమ్మ, సునీత బైక్ ఎక్కి వెళ్లారు. మహబూబాబాద్ రోడ్డులో కొద్ది దూరం వెళ్లిన తరువాత బైక్ ఆపి, తాగడానికి నీళ్లు తీసుకువస్తానని ఆ ఇద్దరు మహిళలను దింపాడు. అనంతరం ఆ ద్విచక్రవాహనంపై నీళ్లు తీసుకొని వస్తానని వెళ్లి, మరో వ్యక్తికి తీసుకుకొని వచ్చి గూబ కొమురమ్మ మెడలో ఉన్న రెండు తులాల బంగారం గొలుసును అపహరించుకుపోయిన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై భూక్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సీసీ ఫుటేజ్ ఆధారంగా విచారణ చేపడుతున్నట్లు సీఐ గణేష్ వివరించారు.

పరిహారంతోనే పంచాయితీ

- కొలిక్కిరాని మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణ
- పరిహారంపై స్పష్టత రాకపోవడంతో రైతుల వెనుకంజ
- ఎకరానికి రూ.2 కోట్లకు డిమాండ్.. రూ.60 లక్షలలోపే అధికారుల మొగ్గు
- సీఎం చొరవతో సమస్య పరిష్కారం అవుతుందంటున్న ఓరుగల్లు వాసులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)


వరంగల్ ఎయిర్‌పోర్టుకు చకచకా అనుమతులు వచ్చినా.. భూసేకరణకు అడుగులు ముందుకు పడటం లేదు. విమానాశ్రయానికి కావాల్సిన 253 ఎకరాల భూమిని సేకరించేందుకు రెవెన్యూ అధికారులు సర్వే పూర్తి చేసినప్పటికీ రైతులకు చెల్లించే పరిహారం కొలిక్కిరావటం లేదు. ఎకరాకు రూ. 2 కోట్లతో పాటు నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తుండగా ఇచ్చే పరిస్థితి కనబడడం లేదు. దీంతో భూసేకరణపై పలు దఫాలుగా రైతులతో చర్చలు జరిపినప్పటికీ కొలిక్కి రాకపోవటంతో విమానాశ్రయం నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది.

కొలిక్కిరాని భూసేకరణ

వరంగల్ ఎయిర్‌పోర్టుకు కావాల్సిన అనుమతులన్నీ దాదాపుగా వచ్చేసినప్పటికీ కీలకమైన భూసేకరణ అంశమే తేలటం లేదు. మామునూరులో ఇప్పటికే 669ఎకరాల భూమి ఎయిర్‌పోర్టు ఆధీనంలో ఉంది. అయితే ఇప్పుడున్న రన్‌వేను విస్తరించటంతో పాటు టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ), నేవిగేషన్ ఇన్‌స్ట్రుమెంట్ ఇన్‌స్టలేషన్ నిర్మాణాలు చేపట్టేందుకు ఎయిర్‌పోర్టుకు మరో 253 ఎకరాల భూమి అవసరంగా ఏఏఐ గుర్తించింది. దీంతో నవంబరు 17వ తేదీన ప్రభుత్వం రూ.205కోట్ల నిధులు కేటాయిస్తూ జీవో విడుదల చేసింది. ఖిలా వరంగల్ మండలం పరిధిలోని గుంటూరుపల్లి, నక్కలపల్లి, గాడిపల్లి గ్రామాల్లో 233 మంది రైతుల నుంచి 253 ఎకరాల భూమిని సేకరించేందుకు అధికారులు సర్వే పూర్తి చేశారు. ఇందులో వ్యవసాయ, అసైన్డ్ భూములతో పాటు లేఅవుట్ ప్లాట్లు, 13 నివాస గృహాలు కూడా ఉన్నాయి. దీనికి సంబంధించి మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, వర్ధన్నపేట

విమానాశ్రయానికి గ్రీన్ సిగ్నల్

వరంగల్ ఎయిర్‌పోర్టుకు అన్ని అనుకూలతలు ఉన్నాయని ఫిబ్రవరి 28న ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రకటించింది. అలాగే ఎయిర్‌పోర్టుకు అడ్డంకిగా ఉన్న 150కిలో మీటర్ల నిబంధనపై హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (హెచ్‌ఐఏఎల్)తో రాష్ట్ర ప్రభుత్వం చర్చించింది. హెచ్‌ఐఏఎల్‌ను ఒప్పించటంతో పాటు ఏఏఐతో నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇప్పించింది. ఇక ఓఎల్ఎస్ సర్వే, సాయిల్ టెస్టింగ్‌తో పాటు వివిధ సర్వే సంస్థల నివేదికలతో పాటు టెక్నో ఎకనామికల్ ఫీజిబిలిటీ స్టడీ రిపోర్టును ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)పూర్తి చేసి గత 2023 జూలై 7వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. జియాజికల్ సర్వేతో పాటు స్కై అండ్ ల్యాండ్ సర్వే చేపట్టారు. వరంగల్ ఎయిర్‌పోర్టు నుంచి అంతర్జాతీయ స్థాయిలో విమానాలు నడిపేందుకు అనుకూలంగా ఉందని సర్వే రిపోర్టులు రావటంతో ఏఏఐ వరంగల్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.



గాడిపల్లి గ్రామంలోని సర్వే నెంబరు 40/ఏ భూమికి మార్కెట్ విలువ రూ.6 లక్షలు, ఇదే గ్రామంలో సర్వే నెంబరు 78కి మార్కెట్ విలువ రూ.40.66 లక్షలు చూపిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద రైతులతో పలు మార్లు సమావేశాలు నిర్వహించారు. పరిహారం విషయంలో రైతులు పట్టుబడుతున్నారు. తొలుత తమకు భూమికి బదులు భూమి ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. అయితే ఇది సాధ్యమయ్యే పని కాదని, మార్కెట్ విలువకు అనుగుణంగా ధరలు చెల్లిస్తామని చెప్పి అధికారులు సర్వే పూర్తి చేశారు. చివరిగా గత గురువారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో రైతులతో జిల్లా కలెక్టర్‌తో పాటు అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్ తదితరులు చర్చించారు. భూమికి బదులు భూమి ఇవ్వకుంటే తమకు ఎకరాకు రూ.2కోట్ల పరిహారంతో పాటు ప్రభుత్వం నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఎకరాకు రూ.30లక్షల వరకు చెల్లించేందుకు అధికారులు రైతులను ఒప్పించే ప్రయత్నం చేశారు. అయితే రైతులు పట్టువీడకపోవటంతో చివరకు ఏరియాను బట్టి భూమికి రూ.60లక్షల వరకు చెల్లించేందుకు ముందుకు వచ్చినప్పటికీ రైతులు ఒప్పుకోవటం లేదు.

భారీగా తేడాలు

మామునూరు ఎయిర్‌పోర్టు పరిధిలోని గ్రామాలన్నీ కూడా గ్రేటర్ పరిధిలో ఉన్నాయి. అయితే రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమో లేక ఉద్దేశపూర్వకంగానో గానీ.. ఎయిర్ పోర్టు పరిధిలోకి వచ్చే చాలా భూముల మార్కెట్ విలువలో వ్యత్యాసాలు ఉన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. మామునూరు ఎయిర్‌పోర్టు కోసం 2008 నుంచి పలుమార్లు భూముల సర్వే నిర్వహిస్తున్నారు. 2020లో కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం గాడిపల్లి, నక్కలపల్లి, గుంటూరుపల్లి గ్రామాల్లో భూముల సర్వే నిర్వహించింది. తాజాగా 2025 మార్చిలో కూడా భూముల సర్వే నిర్వహించారు. అయితే గాడిపల్లి గ్రామంలోని సర్వే నెంబరు 40/ఏ భూమికి మార్కెట్ వాల్యూ రూ.6లక్షలు ఉండగా, ఇదే గ్రామంలో సర్వే నెంబరు 78కి మార్కెట్ వాల్యూ రూ.40.66లక్షలు ఉంది. భూముల ధరల్లో భారీగా తేడాలు ఉండటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నాళ్లున్నప్పటికీ తమ భూములను ఎయిర్‌పోర్టుకి ఇవ్వాల్సిందేనని, అందుకే రెవెన్యూ అధికారులు భూముల మార్కెట్ ధరను తక్కువ నిర్ణయించారని ఆరోపిస్తున్నారు. పూర్వం నుంచి భూమినే నమ్ముకుని బతుకుతున్నామని, ఇదికూడా పోతే ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. అయితే రైతులు పరిహారం విషయంలో పెడుతున్న డిమాండ్లపై అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లుగా సమాచారం.

ఎయిర్‌పోర్టు పనుల్లో జాప్యం

భూసేకరణ కొలిక్కిరాకపోవటంతో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల్లో కూడా జాప్యం జరుగనుంది. ప్రస్తుతం మామునూరులో ఉన్న పాత 1.8కి.మీ రన్‌వేను అంతర్జాతీయ స్థాయిలో విమానాలు నడిపించేందుకు అనుకూలంగా ఉండేలా 3.9కి.మీలకు పెంచాలని ఏఏఐ అధికారులు సూచించారు. ఇప్పటికే ఫైలట్, సిబ్బంది, టెర్మినల్స్‌తో పాటు సుమారు 694ఎకరాల వరకు భూమి ఉంది. మిగతా 253 ఎకరాల భూమిని కేటాయిస్తే ఎయిర్‌బస్‌లను నడిపించేలా రన్‌వేను నిర్మించవచ్చని ఏఏఐ అధికారులు ప్రభుత్వానికి సూచించారు. ఈ నెలఖారులోగా భూసేకరణ పూర్తిచేస్తే మే నెలలో విమానాశ్రయం పనులు మొదలయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ వరంగల్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సుమారు రూ.450కోట్ల వరకు నిధులు కేటాయించింది. భూసేకరణ పూర్తయితే పనులు చేపట్టేందుకు ఏఏఐ సిద్ధంగా ఉంది. మొత్తానికి భూసేకరణపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రైతులకు న్యాయబద్ధంగా పరిహారం చెల్లించి, సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని ఓరుగల్లువాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఓటరు నమోదు.. నిరంతరం

18 ఏళ్లు నిండితే అర్హులు » ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

వర్ధన్నపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : త్వరలోనే స్థానిక సంస్థలకు నోటిఫికేషన్ రానుంది. ఎన్నికల సంఘం ఓటరు నమోదును నిరంతర ప్రక్రియగా చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ నాటికి కటాఫ్ తేదీని ఖరారు చేసి తుది ఓటరు జాబితాను ప్రకటించనుంది. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా యువత ఓటరుగా నమోదు చేసుకోవడమే మేలు.

నిరంతర ప్రక్రియ

గతంలో ఓటర్ల నమోదుకు జనవరి 1వ తేదీ మాత్రమే ప్రామాణికంగా తీసుకునేవారు. ఆ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటర్లుగా అర్హత లభించేది. ప్రస్తుతం ఆ విధానానికి స్వస్తి పలికారు. జనవరి 1, ఏప్రిల్ 1. జూలై 1, అక్టోబర్ 1 తేదీలను ప్రామాణికంగా తీసుకోవాలని ఎన్నికల సంఘం నిర్దేశించింది. జాబితాలో లాజికల్ పొరపాట్లు, డెమోగ్రాఫిక్ పొరపాట్లను పూర్తిస్థాయిలో సవరించాలని అధికారులను ఆదేశించింది.

ఓటరు నమోదుకు మార్గదర్శకాలు

అరచేతిలోనే ఓటరు నమోదు చేసుకోవచ్చు. వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. సర్వీస్ పోర్టల్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయాలి. అందులో మొబైల్ నెంబర్‌తో సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం లాగిన్ అవ్వాలి. ఆన్‌లైన్‌లో కొత్తఓటుకు రిజిస్ట్రేషన్ చేసుకోవడం, తప్పులను సరిచేసుకోవడానికి, ఓటుహక్కును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ చేసుకోవడానికి, జాబితాలో రెండు ఓట్లు ఉంటే ఒకదానిని తొలగింపు, ఇతర అంశాలకు సంబంధించి వేరువేరుగా ఫారం-6, ఫారం-7, ఫారం-8 కనిపిస్తాయి. వాటిలో మీకు కావలసిన దానిపై క్లిక్ చేసి అందులో పొందుపరచాల్సిన వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలని. వివరాలు ఏఈఆర్‌ఓ వద్దకు వెళతాయి. ఆయన వాటిని పరిశీలించి ఆమోదిస్తారు.



యాప్‌తో కూడా..

వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోలేని పరిస్థితుల్లో మీ వద్ద మొబైల్‌లో ఓటర్స్.ఈసీఐ.జీఓవీ.ఇన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. దానిపై క్లిక్ చేయగానే పోర్టల్ ఓపెన్ అవుతుంది. కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చు. జాబితాలో పేరుందా లేదా చూసుకునే అవకాశం కల్పించారు.

గుర్తింపు కార్డు పొందడమిలా..

ఓటరు గుర్తింపుకార్డు కావాలనుకునేవారు వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. అందులో ఈ-ఎపిక్ కార్డు డౌన్‌లోడ్ అని కనిపిస్తుంది. దానిపై క్లిక్‌చేసి మొబైల్, ఎపిక్‌కార్డు నెంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. గుర్తింపు కార్డుకు ఫోన్ నెంబర్ అనుసంధానం అయితే ఓటీపీ వస్తుంది. లేకుంటే రాదు. ఫారం -8 ద్వారా ఫోన్ నెంబర్ అనుసంధానం చేసుకోవచ్చు. తరువాత గుర్తింపు కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

నమోదుపై సందేహం

ఓటరు నమోదు, ఎన్నికల సంబంధించి 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఫిర్యాదు కూడా చేయవచ్చు.



ఆఫ్‌లైన్ లోనూ యువ వికాసం

- దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం అవకాశం
- అందుబాటులో ఫారాలు
- ఎంపీడీవో, మున్సిపల్ ఆఫీసుల్లో హెల్ప్‌డెస్క్‌లు
- ప్రత్యేకంగా సిబ్బంది నియామకం

దరఖాస్తు ఫారం డౌన్‌లోడ్

దరఖాస్తు ఫారాల కోసం ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అన్ని వివరాలతో పూర్తి చేసిన తర్వాత వాటిని స్వయంగా అందచేస్తే సరిపోతుంది. దరఖాస్తు ఫారమ్ కోసం https://tgobmmsnew.cgg.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. హోం పేజీలో క్లిక్ హియర్ టు డౌన్‌లోడ్ అప్లికేషన్ ఫామ్ అనే ఆప్షన్ కనిపిస్తుంది. దీనిపై క్లిక్ చేస్తే దరఖాస్తు ఫామ్ ఓపెన్ అవుతుంది. ప్రింట్ లేదా డౌన్‌లోడ్ ఆప్షన్‌పై నొక్కి అప్లికేషన్ ఫామ్‌ను పొందవచ్చు.

హనుమకొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే కాకుండా ఆఫ్‌లైన్‌లో కూడా దాఖలు చేయవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల దాఖలుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ అవకాశం కల్పించింది. ఇప్పటి వరకు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులను స్వీకరించారు. అయితే తరుచూ సర్వర్ డౌన్ అవుతుండడం, సైట్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతుండడంతో మీ సేవా కేంద్రాల్లో ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకోలేక పోయారు. మొదట నిర్ణయించిన గడువు ఈనెల 5వ తేదీ దరకు జిల్లాలో 14,496 మంది మాత్రమే దరఖాస్తులు చేసుకున్నారు. ఇంకా అనేక మంది దరఖాస్తులు చేసుకోవలసి ఉంది. వీరంతా మీ సేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. పరిస్థితిని గమనించిన ప్రభుత్వం దరఖాస్తుల దాఖలు గడువును ఈనెల 14 వరకు పొడిగించింది. దీంతో పాటు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తుల దాఖలుకు వీలు కల్పించింది. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను ఎంపీడీవో, నగర పాలక సంస్థ, మున్సిపల్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. అయితే ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో సమస్యలు ఎదురైనవారే ఆఫ్‌లైన్‌ను ఉపయోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు ఇలా..

ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసే అభ్యర్థుల కోసం ప్రభుత్వం నమూనా ప్రతులను రూపొందించింది. అభ్యర్థికి సంబంధించిన వివరాలను 27 కాలమ్స్‌లో పూరించాలి. ఆధార్‌కార్డు జతపరచాలి. ఆహార భద్రతా కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రం, రెండింటిలో ఏది జతపరిచినా సరిపోతుంది. కుల ధృవీకరణ పత్రం, దివ్యాంగులైతే సదరం ధృవపత్రం జతపరచాలని అధికారులు స్పష్టం చేశారు. ఆఫ్‌లైన్ వచ్చిన దరఖాస్తు లను పరిశీలించి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

సిబ్బంది నియామకం

రాజీవ్ యువ వికాసం పథకంపై నిరుద్యోగ యువతీ యువకులకు అవగాహన కల్పించి ఈ పథకాన్ని వారు సద్వినియోగం చేసుకునేలా అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. దరఖాస్తు చేసుకోవడంలో సహాయం అందించేందుకు, మార్గదర్శనం నెరపడానికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. అన్ని మండల పరిషత్‌లు, మున్సిపల్ కార్యాలయాల్లో రాజీవ్ యువ వికాసం హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి సిబ్బందిని అందుబాటులో ఉంచారు. మున్సిపాలిటీల్లో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించే బాధ్యతను వార్డు ఆఫీసర్లకు అప్పగించారు.


యూనిట్లకు సబ్సిడీ

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకువచ్చింది తెలిసిందే. రాజీవ్ యువ వికాస పథకం కింద రూ.50,000 విలువ చేసే యూనిట్‌కు వంద శాతం ఇస్తారు. రూ. 50,001 నుంచి రూ.1,00,000 విలువ చేసే యూనిట్‌కు 90 శాతం సబ్సిడీ లభిస్తుంది. మిగతా పది శాతం లబ్ధిదారుడు భరించాల్సి ఉంటుంది. రూ.1,00,001 నుంచి రూ.2,00,000 విలువ కలిగిన యూనిట్లకు 80 శాతం సబ్సిడీ లభించగా మిగతా 20 శాతం లబ్ధిదారులు భరించాలి. అలాగే రూ.2,00,001 నుంచి రూ.4,00,000 విలువైన యూనిట్లకు సబ్సిడీ 70శాతం ఇస్తారు. మిగతా 30 శాతం లబ్ధిదారుడు సమకూర్చుకోవాలి.

కోచ్ కావాలనుకుంటున్నారా ?

- 'సాయ్' సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం
- ఎన్ఐఎస్ ఆధ్వర్యంలో ఆరు వారాల పాటు శిక్షణ

హనుమకొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో అభిరుచి ఉండి కోచ్ కావాలనుకునేవారికి భారత క్రీడా ప్రాధికారిక సంస్థ (సాయ్) అవకాశం కల్పిస్తోంది. ఆసక్తి కలిగిన వారి నుంచి ఈ మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. నేతాజీ సుభాష్ జాతీయ క్రీడా సంస్థ (ఎన్ఐఎస్) ఆధ్వర్యంలో ఆయా క్రీడల్లో ఆరు వారాల పాటు సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తుంది.



క్రీడలు.. శిక్షణ

కన్నోయింగ్ అండ్ కయాకింగ్, హాకీ, సాఫ్ట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, క్రికెట్, జూడో, షూటింగ్, వెయిట్ లిఫ్టింగ్, బ్యాడ్మిం టన్, ఫెన్సింగ్, కబడ్డీ, స్విమ్మింగ్, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, ఖోఖో, తైక్వాండో, ఉషూ, బాక్సింగ్, జిమ్నాస్టిక్స్, రోల్‌బాల్, టేబుల్ టెన్నిస్, యోగాసన, సైక్లింగ్, హ్యాండ్‌బాల్, రోయింగ్, లాన్ టెన్నిస్ క్రీడల్లో ఈ కోర్సులను నిర్వహిస్తారు. ఇందులో ఎంచుకున్న క్రీడాంశాల్లో ఆరు వారాల పాటు శిక్షణ ఇస్తారు. పటియాల, బెంగుళూరు, కోల్‌కతా ప్రాంతాల్లో ఎన్ఎస్, ఐఎన్ఎస్ శిక్షణా కేంద్రాల్లో ఈ శిక్షణ ఉంటుంది.

కోర్సు వ్యవధి

కోర్సు వ్యవధి ఆరు వారాలు. ఇది సర్టిఫికెట్ కోర్సు. ఈ ఆరు వారాల్లో నెలరోజులు ఆన్‌లైన్‌లో థియరీ, పదిహేను రోజులు హాఫ్‌లైన్‌లో ప్రాక్టికల్స్ ఉంటాయి. ఏప్రిల్ 14లోగా http:///www.6wcc.nsnis.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. ఈ కోర్సులో శిక్షణ తీసుకున్నవారు తాము ఎంచుకున్న క్రీడలో కోచ్‌గా రాణించవచ్చు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటికే చాలా మంది క్రీడాకారులు శిక్షణ పొంది ఆయా సంస్థల్లో కోచ్‌లుగా కొనసాగుతున్నారు. పిల్లలకు క్రీడల్లో కోచింగ్ ఇవ్వాలనుకునేవారు ఈ కోర్సులో చేరవచ్చు.

అర్హులు

క్రీడా కోర్సుల్లో చేరాలనుకునేవారు ఇంటర్ ఉత్తీర్ణత పొంది ఉండాలి. వయసు 2025 ఏప్రిల్ 14వ తేదీ నాటికి 24 నుంచి 42 ఏళ్లలోపు ఉండాలి. జిల్లా స్థాయి ఛాంపియన్ షిప్ పోటీల్లో మొదటి మూడు స్థానాలు పొంది ఉండాలి. రాష్ట్ర స్థాయి, ఆలిండియా యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్, జోనల్ ఇంటర్ యూనివర్సిటీ స్థాయి పోటీలలో ప్రాతినిధ్యం నెరిపి ఉండాలి. ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లో జూనియర్, సీనియర్ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ఉండాలి.

పచ్చదనం

- ప్రభుత్వ కార్యాలయాల్లో ఆహ్లాదాన్ని పంచుతున్న వృక్షాలు



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉన్న వేపచెట్టు నీడలో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు

పర్వతగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో పచ్చదనం వెల్లువిరుస్తోంది. ఆఫీసులోకి వెళ్లేందుకు గేటు లోపలికి రాగానే సుమారు వంద చెట్లు దర్శనమిస్తాయి. పలు పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చిన ప్రజలు, వచ్చిన పని ఆలస్యమైతే అదే చెట్ల నీడన కూర్చుంటున్నారు. 1991లో తహసీల్దార్ కార్యాలయం, 1994లో ఎంపీడీవో కార్యాలయాలు ఒకే ఆవరణలో నిర్మించి ప్రారంభించారు. అయితే అప్పటి అధికారులు కార్యాలయాల ఆవరణలోని ఖాళీ స్థలాల్లో వేప, మర్రి, రావి, టేకు తదితర మొక్కలను నాటారు. అయితే అవి ఇప్పుడు వృక్షలుగా మారి పని కోసం వచ్చే ప్రజలతోపాటు అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు నీడనిస్తున్నాయి. ఉద్యోగులు వారి వాహనాలను సైతం చెట్ల నీడలోనే పెట్టుకుంటున్నారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంలోని సిబ్బంది ప్రతీ రోజు ఆ చెట్ల వద్ద శుభ్రంచేస్తూ, వాటికి నీళ్లు పోస్తూ కాపాడుకుంటూ వస్తున్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న మర్రిచెట్టు



తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న చెట్లు



వారికి.. ఆరు బయటే.. బారు

మందు బాబులకు ఏ చోటైనా ఒకటేలా ఉంది. వైన్స్‌షాపుల ముందే ఎంచక్కా లాగించేస్తున్నారు. ముఖ్యంగా హనుమకొండలోని పెగడపల్లి డబ్బాల ప్రాంతంలో ఇది మరీ ఎక్కువైంది. ఇక్కడ వైన్‌షాపునకు ఇరువైపులా మద్యం యథేచ్ఛగా తాగుతున్నారు. ఈ మందుబాబుల తాకిడితో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. అలాగే అటుగా వెళ్లే వారికి అసౌకర్యంగా మారింది. పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

కూటి కోసం.. ఎండ తిప్పలు!

ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ సందర్భంగా రేషన్‌షాపుల వద్ద ఏర్పాట్లు చేయకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండలోనే బారులుతీరి అవస్థలు పడుతున్నారు. సన్నబియ్యం పంపిణీ సందర్భంగా తాకిడి ఎక్కువకావడంతో ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ షాపుల వద్ద సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.



- ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్/హనుమకొండ

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యం

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డేపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుతూ పరిరక్షించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పశ్చిమ నియోజకవర్గంలోని 51, 57, 59 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి 57వ డివిజన్‌లోని గోకుల్ జంక్షన్‌లో ప్రారంభమైన జై బాపు, జై భీమ్, జై సంవిధాన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర 51వ డివిజన్ శాంతినగర్ హౌసింగ్ బోర్డు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధినేతలు రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్‌యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, డివిజన్ ఇన్‌చార్జి కేతిరి దీపక్‌రెడ్డి, 51, 57, 58, 59, 60 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

శోభాయాత్రను జయప్రదం చేయాలి

భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకుడు జయపాల్‌రెడ్డి



మహంకాళి మైదానంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సనాతనవాదులు

శంభునిపేట, ఏప్రిల్ 5: హనుమాన్ జయంతి సందర్భంగా నగరంలో నిర్వహించే వీరహనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, సనాతనవాదులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను హిందూ సంఘాల నాయకులు శనివారం ఆవిష్కరించారు. అనంతరం భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ మహానగర అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 12 చైత్రపౌర్ణమి శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా రంగశాయిపేటలోని మహంకాళి మైదానంలో శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. కరీమాబాద్, చౌరస్తా, స్టేషన్ రోడ్, కాశిబుగ్గ, పోచమ్మమైదాన్, ఎంజీఎం, ములుగురోడ్, అలంకార్ జంక్షన్ మీదుగా హనుమద్గిరి పద్మాక్షి దేవాలయం వరకు 10 వేల మందితో శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. శోభాయాత్రను విజయవంతం చేయటానికి హిందూవులందరూ కదిలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మహానగర వీహెచ్‌పీ కార్యదర్శి వెలగందుల రాజు, వరంగల్ గోరక్ష ప్రముఖ్ నంగునూరి నాగరాజు, మిట్టపల్లి కపిల్‌జీ, ఖిలా ప్రఖండ కార్యదర్శి రమేష్ గౌడ్, పెరుమాండ్ల రమేష్, పాకనాటి చక్రపాణి, బక్కి రంజిత్, తాళ్ళపల్లి అర్జున్, గండ నాగరాజు, ఇనుముల సతీష్, రావుల శేఖర్, పెద్దోజు విక్రమ్, దుబ్బాల అశోక్, దూడ పరమేష్, చాపల నాగరాజు, మోహనాచారి తదితరులు పాల్గొన్నారు.

గోల్డెన్ ఓక్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాఠశాల చైర్మన్ గంటా రవికుమార్

ఖిలావరంగల్, ఏప్రిల్, 5(ఆంధ్రజ్యోతి): శివనగర్‌లోని గోల్డెన్ ఓక్ ప్రీప్రైమరీ స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా గోల్డెన్ ఓక్ స్కూల్ చైర్మన్ గంటా రవికుమార్ మాట్లాడుతూ.. ప్రాథమిక దశలో విద్యార్థులకు బలమైన పునాది వేసేది ఉపాధ్యాయులేనని అన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంబైలో కాటన్ అసోసియేషన్ సెమినార్

వరంగల్ సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం ఆస్ట్రేలియన్ కాటన్ షిప్పర్స్ అసోసియేషన్ డెలిగేట్స్‌తో ముంబైలో సెమినార్ నిర్వహించారు. దీనికి తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేష్ హాజరయ్యారు. సెమినార్‌లో ఆస్ట్రేలియలో పత్తిసాగు, ఉత్పత్తి, నాణ్యత ప్రమాణాలు పాటించే అంశాలపై అవగాహన కల్పించారు. ఆస్ట్రేలియాలో 50 లక్షల బేళ్ల పత్తి 1500ల మంది రైతులతో పెద్ద కమతాలలో సాగుచేస్తారని వివరించారు.

జగ్జీవన్ స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలి

రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



జయంతి సభలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

న్యూశాయంపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధాని, దివంగత నేత డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్‌ను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకెళ్లాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ములుగురోడ్‌లోని ఎల్బీ కళాశాల ఆడిటోరియంలో శనివారం జగ్జీవన్‌రామ్ 118వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ అంటరానితనం నిర్మూలనకు కృషి చేశారని అన్నారు. నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. నవ భారత నిర్మాణంలో నాలుగు దశాబ్దాలు అవిశ్రాంత కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● **పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

గిర్మాజిపేట : వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి కొండా సురేఖ శనివారం శంకుస్థాపనలు చేశారు. 26వ డివిజన్ పరిధిలోని లక్ష్మీపురం రోడ్డులో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న సిక్కు కమ్యూనిటీ హాల్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గురుద్వారాలో సిక్కులు, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బాల్నె సురేష్, సిక్కులు పాల్గొన్నారు. అదేవిధంగా వరంగల్ కూరగాయల మార్కెట్‌లో రూ.30 లక్షలతో చేపట్టిన ఓపెన్ షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సత్వరం పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు జారతి రమేష్, మీసాల ప్రకాష్, కూరగాయల మార్కెట్ వ్యాపారుల సంఘం ప్రతినిధులు జారతి శ్రీనివాస్, జారతి వెంకట్, అశోక్, శ్రీనివాస్, మల్లేశం, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

● **11న జాబ్ మేళా**

గిర్మాజిపేట: ఈనెల 11న వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని ఎం.కె.నాయుడు కన్వెన్షన్ హాల్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, వరంగల్ తూర్పు నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. శనివారం వరంగల్ 27వ డివిజన్‌లో సన్నబియ్యం ప్రారంభించిన అనంతరం ఆమె జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ అకాడమి ఆఫ్ స్కిల్స్ అండ్ నాలెడ్జి సహకారంతో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో 50కు పైగా వివిధ కంపెనీలు పాల్గొంటాయని, ఆరువేల మంది ఉద్యోగాలు కల్పిస్తాయని అన్నారు. టెన్త్, ఇంటర్, ఐ.టి.ఐ, గ్రాడ్యుయేషన్, పోస్టుగ్రాడ్యుయట్ అర్హత గలవారు నాలుగు రెజ్యూమ్‌లతో ఈనెల 11వ తేది ఉదయం 9.30 గంటలకు కన్వెన్షన్‌కు రావాలని, తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మంత్రి కోరారు.

● **సన్నబియ్యం పంపిణీ దేశానికే ఆదర్శం**

కరీమాబాద్: తమ ప్రభుత్వం ప్రారంభించిన సన్నబియ్యం పంపిణీ దేశానికే ఆదర్శమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం వరంగల్ ఎస్ఆర్ఆర్ తోటలో ఆమె సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరుపేదల కడుపునింపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం విజయవంతం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సత్యశారద, నగర మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్ పల్లం పద్మరవి, కాంగ్రెస్ నాయకులు నాగపూరి సంజయ్‌బాబు, మేడిది మధుసూదన్, గడ్డం యుగేందర్ పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: వరంగల్ తూర్పుకోటలోని 34వ నెంబర్ రేషన్‌షాపు వద్ద మంత్రి కొండా సురేఖ శనివారం సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దారి దోపిడీ కేసులో నిందితుల ఆరెస్టు

వరంగల్ టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దారిదోపిడీకి పాల్పడిన కేసులో ముగ్గురు నిందితులను ఇంతేజార్‌గంజ్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీఐ ఎంఏ షుకూర్ తెలిపిన వివరాల ప్రకారం.. దేశాయిపేట ఏకశిలనగర్‌కు చెందిన ఎమ్డీ షహబాజ్ అలియాస్ షెబు, కడారి పవన్ అలియాస్ పాల్, జూపాక మధుకర్ అలియాస్ మధు ఈనెల 3వ తేదీన దేశాయిపేట రోడ్డులోని సూర్యబార్ వద్ద లారీలను ఆపి డ్రైవర్, క్లీనర్‌లను కొట్టి నగదు లాక్కెళ్లారు. ఈ ఘటనపై వరంగల్ ఎల్బీనగర్‌కు చెందిన బాధితుడు జాకీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసిన పోలీసులు శనివారం ముగ్గురిని అదుపులోకి తీసుకొని కోర్టుకు రిమాండ్ చేశారు. వారి వద్ద రూ.3వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

పల్లి గింజపై శ్రీరాముడు





మైక్రో ఆర్టిస్ట్ లింగమూర్తి

పల్లిగింజపై గీసిన శ్రీరాముని చిత్రం

మట్టెవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాశిబుగ్గ సాయిగణేష్ కాలనీకి చెందిన మైక్రో ఆర్టిస్ట్ కుసుమ లింగమూర్తి శ్రీరామనవమి పండగను పురస్కరించుకొని అందరూ అబ్బురపడేలా పల్లిగింజపై శ్రీరాముడి ప్రతిమను గీశారు. గతంలో తెలంగాణ ఏర్పాటు సమయంలో ఆయన బియ్యపు గింజలతో తెలంగాణ ఆకారాన్ని రూపొందించారు. అంతేగాకుండా గతంలో పల్లిగింజపై వినాయకుడి బొమ్మను, శనగ పప్పు మీద వివేకానందుని బొమ్మను గీసి అందరినీ ఆకట్టుకున్నారు.

అమ్మవారికి చామంతి పూలతో అర్చన



లక్ష చామంతి పూలతో అర్చన చేస్తున్న పూజారులు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి గాంచిన భద్రకాళి దేవస్థానంలో వసంత నవరాత్రి మహోత్సవాలు ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శనివారం అమ్మవారికి లక్ష పసుపు రంగు చామంతి పూలతో అర్చన చేశారు. పుష్పార్చన దాత అయిన బాల జననికి అమ్మవారి శేష వస్త్రాలను బహూకరించారు.

ఆలయాల్లో ప్రారంభమైన కల్యాణోత్సవాలు



కల్యాణానికి ముస్తాబవుతున్న విశ్వనాథకాలనీ

శంభునిపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రంగశాయిపేటలో గల రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. పూజారి తిరుమల శ్రీధరాచార్యుల ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు అంకుర పూజలు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ ఫౌండర్ ట్రస్టీ పులిగిళ్ళ వెంకటరామనరసింహశాస్త్రి, కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్, కేడల పద్మజనార్దన్, వద్దిరాజు శ్యామ్‌సుందర్‌రావు, వలుపదాసు కృష్ణ, శ్రీరామభజనమండలి, మహిళా విభాగం సభ్యులు, ఉత్సవ నిర్వహణ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు. 41వ డివిజన్‌లోని విశ్వనాథకాలనీ అభయాంజనేయ ఆలయంలో కల్యాణ మహోత్సవాలకు ఆలయ చైర్మన్ కర్నె రవీందర్ ఏర్పాట్లు చేస్తున్నారు. శంభునిపేట కార్యసిద్ధి హనుమాన్ ఆలయంలో, విశ్వనాథకాలనీ గోకులంలో, గణేష్‌నగర్, సత్యసాయినగర్ ప్రాంతాలలో కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

● కరీమాబాద్: అండర్ రైల్వేగేటు ప్రాంతంలోని ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. కరీమాబాద్‌లోని రామస్వామి దేవాలయం, ఉర్సు శివాంజనేయస్వామి దేవాలయం, బీఆర్‌నగర్‌లోని శివాలయాల్లో నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ప్రాంగణాలలో చలువ పందిళ్ల వేశారు. ఆలయాలకు రంగులు వేసి సుందరీకరణ పనులు చేపట్టారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు ఆలయాల్లో మహాన్నదానాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వేసవి కాలం కావడంతో భక్తులకు అసౌకర్యం కలుగకుండా తాగునీటి వసతిని కల్పించారు.

రజతోత్సవ సభను జయప్రదం చేయండి

● **మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

మట్టెవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పిలుపునిచ్చారు. శనివారం వరంగల్ 19వ డివిజన్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ 25 ఏళ్లుగా తెలంగాణ ప్రజల ఆశయాలకు అంకితమై పని చేస్తోందని, పార్టీ సాధించిన విజయాలు ప్రతీ కార్యకర్త గర్వపడేలా ఉన్నాయని అన్నారు. రజతోత్సవ మహాసభలలో ప్రతిఒక్క కార్యకర్త పాల్గొనాలని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా భావించి సభలో ఐక్యతను చాటాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు చిలువేరు పవన్, బయ్యా స్వామి, గోరంట్ల మనోహర్, కంచె సంపత్, పుల్ల రమేశ్, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

● **కార్యకర్తలు తరలిరావాలి..**

మిల్స్‌కాలనీ: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మసూద్ పిలుపునిచ్చారు. శనివారం 36వ డివిజన్‌లోని జేబీనగర్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలోనే 36వ డివిజన్ అన్ని విధాల అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో నిధులు విడుదల కావడం లేదని అన్నారు. అనతి కాలంలోనే ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. రజతోత్సవ సభకు కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏల్పుగొండ యాకయ్య, మర్రి శ్రీనివాస్, గడల రమేష్, రవీందర్, మోహన్‌రావు, సమ్మయ్య, లక్ష్మణ్, నరేష్, రేణుక, అంకూస్, అబ్బు, వేణు, కార్తీక్, లావణ్య, శ్రీకాంత్, మురళీ, ఎల్లయ్య పాల్గొన్నారు.

రేషన్ షాపు వద్ద బీజేపీ నిరసన

ప్రధాని మోదీ ఫొటో పెట్టాలని డిమాండ్



నరేంద్రమోదీ ఫొటోతో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

గిర్మాజిపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల వద్ద ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో పెట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వరంగల్ గోవిందరాజుల గుట్ట ప్రాంతంలో రేషన్ షాపు నంబర్ 15 వద్ద వారు నిరసన తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా రవి కుమార్ ఆధ్వర్యంలో నాయకులు వన్నాల శ్రీరాములు, ఎర్రబెల్లి ప్రదీప్ రావు తో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రధాని మోదీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. సన్నబియ్యం సరఫరా చేస్తున్నది కేంద్ర ప్రభుత్వమేనని, అందువల్ల రేషన్‌షాపుల వద్ద ప్రధాని మోదీ ఫొటో పెట్టాలని డిమాండ్ చేశారు. మోదీ ఫొటోకు క్షీరాభిషేకం చేశారు. దీంతో అక్కడే ఉన్న కార్పొరేటర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ జిందాబాద్ అంటూ ప్రతి నినాదాలు చేశారు. దీంతో పరిస్థితి గమనించిన ఏసీపీ నందిరామ్ నాయక్ జోక్యం చేసుకొని ఇరు పార్టీల నాయకులను శాంతింపజేశారు. తరువాత మంత్రి కొండా సురేఖ వచ్చి సన్న బియ్యం పంపిణీ చేశారు.

జగ్జీవన్ ఆశయాలను కొనసాగించాలి

● **బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు**



దేశాయిపేటలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధాని, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. వరంగల్ దేశాయిపేటలో శనివారం జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తాబేటి వెంకట్‌గౌడ్, మార్టిన్ లూథర్, కందిమల్ల మహేష్, గోకే వెంకటేష్, విప్ప సుధాకర్, జన్ను సుబ్రమణ్యం, శ్రీనాథ్, సంగీత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ ఆధ్వర్యంలో దేశాయిపేటలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయనవిగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాకం హరిశంకర్, గోకే వెంకటేష్, గుండా ప్రభాకర్, మైదం వీరస్వామి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.


టీఎస్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో దేశాయిపేటలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీఎస్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జల రాంకిషన్ ముఖ్య అతిథిగా హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గాజె వేణుగోపాల్, పాలకుర్తి సదానందం, హేమనాయక్, దుర్గారావు, వెలిశాల రాజు, సాలూరి రఘు, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లలో సన్నబియ్యం పంపిణీ

గిర్మాజిపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ 20 డివిజన్ కాశిబుగ్గలో శనివారం సన్నబియ్యం పంపిణీ చేశారు. 20, 32, 62 నంబర్ రేషన్ షాపులలో స్థానిక కార్పొరేటర్ గుండేటి నరేందర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు సన్న బియ్యం అందిస్తున్న మొదటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని కొనియాడారు. అదేవిధంగా 21 డివిజన్‌లో కార్పొరేటర్ పుర్ఖాన్ సన్నబియ్యం పంపిణీ చేశారు.

● శంభునిపేట: 41వ డివిజన్‌లో కార్పొరేటర్ పోశాల పద్మస్వామి శనివారం సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఆరు గ్యారంటీలలో భాగంగా సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పగలు సైతం వెలుగుతున్న వీధి దీపాలు



దుర్గేశ్వర ఆలయం వీధిలో పగలే వెలుగుతున్న వీధి లైటు

మట్టెవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అసలే వేసవికాలం.. విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. మరోవైపు వీధిదీపాలు పట్టపగలు వెలుగుతున్నాయి. అయినా మునిసిపల్ అధికారులు దృష్టి సారించడం లేదు. వరంగల్ దుర్గేశ్వరాలయ వీధిలో పగటి సమయంలో వీధి దీపాలు కొన్ని రోజులుగా వెలుగుతూనే ఉన్నాయి. నగరంలో అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ సిబ్బందికి చలువ కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ డాక్టర్ అడెపు రవీందర్

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వరంగల్ పోచమ్మమైదాన్ చౌరస్తాలో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు వంద మంది ట్రాఫిక్ పోలీసులకు చలువ కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ అడెపు రవీందర్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ పోలీసుల సంక్షేమం కోసం అద్దాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి

(5వ పేజీ తరువాయి)

నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశీయ ధర్మకర్త చెరకు పెల్లి నర్సింహాచార్యులు చెప్పారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక షామియానాల కింద విశాల వేదికపై కల్యాణం నిర్వహిస్తామన్నారు. హనుమకొండలోని గుడిబండల్ శ్రీ వెంకటేశ్వరాలయంలో ఈసారి కల్యాణోత్సవాన్ని భద్రాచల సమయంలోనే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, ప్రధాన అర్చకుడు కలకోట శ్రీనివాసాచార్య తెలిపారు. ఆలయ చైర్మన్ పులి విక్రమ్ కుమార్ ఆధ్వర్యంలో సాయంత్రం స్వామివారిని ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. హనుమకొండ చౌరస్తాలోని శివశక్తి స్థల్‌లో నిర్వహించే శ్రీరామనవమి వేడుకలకు ఆలయ ఉత్సవ సమితి ప్రత్యేక ఆహ్వాన పత్రికలను ముద్రించి ఇంటింటికి పంపడం విశేషం. ములుగురోడ్‌లోని గురుధామంలో శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాలను నిర్వహించి అనంతరం పెద్ద ఎత్తున భక్తులకు మహా ప్రసాద వితరణ చేస్తాని ఆటయ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ చెప్పారు. హనుమకొండ లష్కర్ బజార్‌లోని రామ్‌మందిర్‌లో ఆదివారం మధ్యాహ్నం శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఘనశ్యామ్ శర్మ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు టీటీడీ మేనేజర్ కనపర్తి రఘువీర్ తెలిపారు. అదే విధంగా హనుమకొండ అదాలత్ సమీపంలోని శ్రీభూనీలా సమేత వెంకటేశ్వర ఆలయంలో కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ నిర్వాహకులు చెప్పారు. శనివారం ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకుడు దేశికన్ స్వామి సంప్రదాయంగా సంప్రోక్షణ చేసి ఎదుర్కోలు ఉత్సవాలకు సిద్ధంగా చేశారు. విద్యానగర్ కాలనీలోని విజయ గణపతి ఆలయంలో జరిగే శ్రీరామ నవమి వేడుకలను శనివారం సాయంత్రం ఈ ప్రాంతానికి చెందిన ఇరిగేషన్ సీఈ వెంకటకృష్ణ-మాధవి దంపతులు రాముడిని పెళ్లి కొడుకుగా ముస్తాబుచేసి ఎదుర్కోలు ఉత్సవానికి తీసుకెళ్లారు. అదే విధంగా ఎన్‌జీవోస్ కాలనీ రోడ్‌లోని శ్రీలక్ష్మీ నగర్ కాలనీలో, పోస్టల్ కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయంలో, షిరిడీ సాయిబాబా ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 గ్రేటర్ వరంగల్
ఆదివారం 6 ఏప్రిల్ 2025



- నిర్మాణానికి 253 ఎకరాలు అవసరమని అంచనా
- సేకరణకు రూ.205కోట్లు విడుదల చేసిన సర్కారు
- రైతులతో ప్రజాప్రతినిధులు, అధికారుల సమావేశం
- ఎకరాకు రూ.2కోట్లకు రైతుల డిమాండ్.. రూ.60లక్షలలోపే అధికారుల మొగ్గు
- కొలిక్కిరాకపోవడంతో రైతుల వెనుకంజ
- ఒకే గ్రామంలోనే భూముల విలువలో తేడాలు ఉండడంతో ఆగ్రహం
- రెవెన్యూ అధికారులు మార్కెట్ ధర పెంచలేదని రైతుల ఆగ్రహం

7

పరిహారంతోనే పంచాయితీ..

కొలిక్కిరాని మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణ

దేవుడు వరమిచ్చినా.. పూజారి కనికరించని చందంగా ఉంది మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణం అంశం. ఓరుగల్లు వాసుల చిరకాల వాంఛ అయిన విమానయానం దరిచేరిందనుకున్న తరుణంలో ఇతర అంశాలు అడ్డుపడుతుండడం నిరాశను కలిగిస్తోంది. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. అందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు వేగంగా చేపట్టారు. ఇందులో ప్రధానంగా భూసేకరణ సవాల్‌గా పరిణమించింది. ఇంతకు ముందు మామునూరులో ఎయిర్‌పోర్టు ఆధీనంలో ఉన్న సుమారు 694ఎకరాలకు తోడుగా మరో 253 ఎకరాల భూమి కావాల్సి వచ్చింది. భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.205కోట్లను విడుదల చేసింది. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులు మామునూరు పరిసర గ్రామాల రైతులతో చర్చించారు. భూమి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. అయితే రైతులు భూమి ఇవ్వడానికి కొన్ని షరతులు పెట్టారు. తొలుత భూమికి బదులు భూమి ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. కుదరదని అధికారులు చెప్పడంతో ఎకరాకు రూ.2కోట్ల వరకు చెల్లించాలని పట్టుబట్టారు. అయితే ఎకరాకు రూ.30లక్షలు చెల్లిస్తామని అధికారులు చెప్పగా రైతులు ఒప్పుకోలేదు. ప్రాంతాన్ని బట్టి రూ.60లక్షలు చెల్లిస్తామని అధికారులు చెప్పగా రైతులు సమ్మతించలేదు. పరిహారం విషయం కొలిక్కిరాకపోవడంతో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వ పెద్దలు స్పందించి పరిష్కరించాలని నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

చిరస్మరణీయుడు జగ్జీవన్ రామ్

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- ఘనంగా 118వ జయంతి వేడుకలు



బాబు జగ్జీవన్ రామ్ జయంతి సభలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి ఉత్సవాన్ని హనుమకొండ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్. నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో పాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు.

ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ చరిత్రను సమాజంలోని ప్రతీ ఒక్కరు స్మరించుకోవల్సిన అవసరం ఉందన్నారు. ఆనాటి కుల వివక్షపై పోరాటం చేసిన గొప్ప చరిత్ర ఆయనదని అన్నారు. జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ వంటి మహనీయుల జీవితాలు, చేసిన త్యాగాలు ఎంతో గొప్పవని కొనియాడారు. నగరంలో జగ్జీవన్‌రాం విగ్రహాన్ని నెలకొల్పడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్. అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ వంటి మహనీయుల త్యాగాల స్ఫూర్తితోనే తాను ఈ స్థాయికి ఎదిగానని అన్నారు. జగ్జీవన్‌రామ్ జీవించినంత కాలం బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన మహనీయుడని పేర్కొన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ ఒక చిన్న కుటుంబం నుంచి దేశ ఉప ప్రధాని స్థాయికి ఎదిగారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వ పరంగా అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆధునిక పరిజ్ఞానం నైపుణ్యాలు, పెంపొందించే విధంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. నైపుణ్య శిక్షణ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని, జిల్లాలోని పరకాల నియోజక వర్గ పరిధిలో స్కిల్ డెవలప్‌మెంట్ చేసినట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. అజీజ్‌ఖాన్, జీడబ్ల్యూఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, హనుమకొండ ఆర్డీవో రమేష్‌రాథోడ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కొంగర జగన్మోహన్, ఉత్సవ కమిటీ చైర్మన్ అంకేశ్వరపు రాంచందర్‌రావు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పుట్ట రవి, ఎమ్మార్పీఎస్ జాతీయ నేత మంద కుమార్ మాదిగ, టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల భిక్షపతి, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు, మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా, డీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమార్, వివిధ ప్రజా సంఘాల నాయకులుపాల్గొన్నారు. మగ్ధుం చేసిన వ్యాఖ్యానం ఆకట్టుకోగా తెలంగాణ సాంస్కృతిక కళాకారులు ఆలాపించిన పాటలు ఆద్యంతం అలరించాయి.

రాష్ట్రంలో మరో 15 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే..

- సన్న బియ్యం పంపిణీకి చట్ట భద్రత కల్పించాం..
- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- తూర్పులో సన్న బియ్యం పంపిణీ ప్రారంభం



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి కొండా సురేఖ

గిర్మాజిపేట,ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజోపయోగ కార్యక్రమాలతో కాంగ్రెస్ ప్రభుత్వం మరో 15ఏళ్ల రాష్ట్రంలో అధికారంలో ఉంటుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆమె వరంగల్ గోవిందరాజుల గుట్ట ప్రాంతంలో సన్న బియ్యం పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పేద ప్రజలకు బియ్యం అందించాలనే కార్యక్రమాన్ని తొలుత ప్రారంభించింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి రుపాయిన్నరకు కిలో బియ్యం పథకాన్ని అమలుచేశారని మంత్రి గుర్తు చేశారు. పేదలకు బియ్యం అందించేందుకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఆహార భద్రత చట్టాన్ని తీసుకు వస్తే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాన్ని ఉగాది నుంచి అమలు చేస్తూ తెలంగాణ పేదలకు సన్న బియ్యం ఉచితంగా ఇస్తున్నారని అన్నారు. సన్న బియ్యం పంపిణీ పథకానికి చట్టభద్రత కల్పించామని, ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఈ పథకాన్ని కొనసాగించాల్సిందేనని స్పష్టం చేశారు. నాడు కేసీఆర్ దొడ్డు బియ్యాన్ని పాలిష్ చేసి హాస్టళ్లకు పంపిణీ చేస్తే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తోందన్నారు. అంతేగా కుండా విదేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నామని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లకు ఉచిత విద్యుత్తు, రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఆర్థిక సహాయం అందిస్తూ తమ ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతుంటే.. బీఆర్ఎస్ పార్టీ కడుపుమంటతో తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి సురేఖ మండిపడ్డారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారిస్తే రేవంత్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా ఆదాయం పెంచుతూ, అప్పులు తీరుస్తూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. సన్న బియ్యం పంపిణీ చేస్తుంటే పేదల కళ్లల్లో సంతోషం కనిపిస్తోందని అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పేదలందరికీ సన్న బియ్యం అందించే బాధ్యత రేషన్ డీలర్లదేనని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ అహ్మద్, కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, గోపాల నవీన్‌రాజ్, జారతి రమేష్, చింతాకుల సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు డప్పు చప్పుళ్లతో మంత్రి సురేఖకుస్వాగతం పలికారు.

శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి..

- నేడు శ్రీ జానకీరాఘవుడి కల్యాణోత్సవం
- ముస్తాబైన రామ, హనుమ ఆలయాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవాదాయ శాఖ అధికారులు
- పలు ఆలయాల్లో సంప్రదాయంగా ఎదుర్కోలు కార్యక్రమం





రెవెన్యూకాలనీలోని రామాలయంలో కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చైత్రశుద్ధ నవమి ఆదివారం జిల్లా అంతటా శ్రీరామ నవమి వేడుకలను జరుపుకునేందుకు ప్రజలంతా సన్నద్ధమయ్యారు. శ్రీరామ నవమి వేళ శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్సవాన్ని వాడవాడలా అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఈసారి అనేక ఉత్సవ కమిటీలు సీతారాములోరి పెళ్లికి కల్యాణ పత్రికలను ముద్రించి సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం నిర్వహించారు. దేవుడి పెళ్లికి ఊరి పెద్దలే ప్రముఖులై నిర్వహించనున్న క్రమంలో ప్రతీ ఒక్కరు రాములోరి పెళ్లి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆరుబయట కల్యాణోత్సవాలు నిర్వహించే ఆలయాల ముందు భక్తులకు ఇబ్బందులు కలగకుండా చలువ పందిళ్లు, మంచినీటి, మజ్జిగ వసతిని ఏర్పాటు చేశారు. హనుమాన్, రామాలయాలతోపాటు ఇతర అన్ని వైష్ణవ ఆలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు భద్రాచలంలో జరిగే 12 గంటల సమయంలో అభిజిత్ లగ్న సుమూర్తంలో జరగనున్నాయి. ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం జరగనున్న నేపథ్యంలో శనివారం రాత్రి అనేక ప్రాంతాల్లో సంప్రదాయంగా సీతారాముల ఎదుర్కొలు ఉత్సవాలను మంగళవాయిద్యాల నడుమ నిర్వహించడం విశేషం.

వేయిస్తంభాల ఆలయంలో..

వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో వైభవంగా జరుగుతున్న సీతారామ వసంత నవరాత్రి వేడుకల సందర్భంగా శనివారం సీతారాముల ఎదుర్కోలును వైభవంగా నిర్వహించారు. కృష్ణ యజుర్వేద పండితుడు గుడిమల్ల విజయ కుమారాచార్యులు, ఆలయ వేద పండితులు మణిశర్మ, ప్రణవ్‌ల వేద మంత్రాల మధ్య గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఎదుర్కోలు వేడుకలు జరిగాయి. అంతకుముందు ధ్వజారోహనం చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయంలో నిత్య మహాసుదర్శన హోమం కూడా జరిగింది. ఈవో అనిల్ కుమార్ పర్యవేక్షించారు. ఆదివారం పెద్ద ఎత్తున కల్యాణోత్సవం నిర్వహించేందుకు అనంతరం భక్తులకు ప్రసాద వితరణకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో చెప్పారు.

రెవెన్యూ రామాలయంలో..

రెవెన్యూ కాలనీలోని సీతారామ ఆలయంలో ఈసారి 40వ కల్యాణ బ్రహ్మోత్సవాలను నిర్వహింపజేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ భూసూరి సాంబమూర్తి, వైస్‌చైర్మన్ రామారావు, సెక్రటరీ ప్రసాద్‌లు చెప్పారు. ఆలయాన్ని మరింత ఆధునీకరింపజేసిన నేపథ్యంలో మొట్టమొదటిసారిగా విశాల మైదానంలో ఆరుబయట కల్యాణోత్సవాన్ని నిర్వహింపజేస్తున్నామన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆరవల్ల శ్రీకాంతాచార్య ఆధ్వర్యంలో కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సంప్రదాయంగా ముత్యాల తలంబ్రాలను తీసుకొచ్చేందుకు జిల్లా కలెక్టర్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఇతర అధికార, అనధికారులను ఆహ్వానించినట్లు నిర్వాహకులు చెప్పారు.

పలు ఆలయాల్లో..

హనుమకొండ రాగన్నదర్వాజలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంగా ప్రసిద్ధిచెందిన చిన్న కోవెలలో పెద్దఎత్తున కల్యాణోత్సవాన్ని

మిగతా 8వ పేజీలో

జాతీయ ఖోఖో క్రీడల్లో తెలంగాణ జట్టుకు 8వ ర్యాంకు

గీసుగొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఒడిశాలోని పూరి జగన్నాధ స్టేడియంలో ఏప్రిల్ 4 వరకు నిర్వహించిన 57వ జాతీయస్థాయి సీనియర్ బాలుర ఖోఖో పోటీలలో తెలంగాణ జట్టు ప్రతిభ కనబరిచి 8వ ర్యాంకు సాధించింది. రాబోయే 39వ జాతీయ క్రీడలకు రాష్ట్ర జట్టు అర్హత సాధించినట్లు క్యాంపు ఇన్‌చార్జీలు కోట రాంబాబు, వీరగోని స్వప్న తెలిపారు. గీసుగొండలో 15 రోజుల పాటు తెలంగాణ జట్టుకు ప్రత్యేక శిక్షణను ఇచ్చినట్లు వారు చెప్పారు. కాగా, శిక్షణకు ఆర్థికసాయం అందించిన అల్లం బాలకిశోర్‌రెడ్డి, పెగళ్లపాటి లక్ష్మీనారాయణ, ఏనుగుల సాంబరెడ్డి, డాక్టర్ మేరుగు సుధాకర్‌రెడ్డి, పసునూటి కళ్యాణ్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఖోఖో లో ప్రతిభ కనబరిచి జాతీయ క్రీడా పోటీలకు అర్హత సాధించిన జట్టును ఖోఖో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, కార్యదర్శి నాతి కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట శ్యాంప్రసాద్ అభినందించారు.



తెలంగాణ ఖోఖో జట్టుతో కోచ్‌లు రాంబాబు, స్వప్న

రాజ్యాంగాన్ని అవమానిస్తున్న బీజేపీ ప్రభుత్వం

● రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో ఎమ్మెల్యే నాగరాజు

పర్వతగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లకు పైగా దేశాన్ని పరిపాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమానిస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ, అప్రజాస్వామ్య పాలన కొనసాగిస్తుందని స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. శనివారం మండలంలోని అన్నారం గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నారం మీదుగా దూపతండా, పెద్దతండా, మోత్యతండా మీదుగా రావూరు వరకు రాజ్యాంగ పరిరక్షణ యాత్రను చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా చేపట్టిన ఈ యాత్ర ద్వార జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ముఖ్య ఉద్దేశమన్నారు. రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడంతోపాటు, బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్‌ను అవమానిస్తూ, రాజ్యాంగాన్ని కించపరిచేలా ఏ విధంగా ప్రవర్తిస్తుందో ప్రజలకు తెలియపరుస్తామన్నారు. పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగాన్ని అణగదొక్కేందుకు చూస్తుందని మండిపడ్డారు.

సన్నబియ్యం పథకంతో పేదోళ్ల ఇంట్లో సంతోషం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పథకంతో పేదోళ్ల ఇంట్లో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం మండలంలోని రావూరు గ్రామంలో బండి రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి రేషన్‌కార్డులో వచ్చిన సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు పరుస్తున్నారని అన్నారు. రేషన్‌కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం అందిస్తూ వారి కడుపునింపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరదరాజేశ్వర్‌రావు, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సువార్త, వినయ్, తదితరులు పాల్గొన్నారు.



అన్నారంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

ప్రభుత్వాస్పత్రి నుంచి

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అవుట్!

● అగమ్యగోచరంగా 15 మంది ఉద్యోగుల జీవితాలు

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విధుల నుంచి తొలగించడంతో ఆ ఉద్యోగాలపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు రోడ్డునపడే పరిస్థితులు నెలకొన్నాయి. వివరాలిలా వున్నాయి. నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అవుతూ వచ్చింది. ప్రస్తుతం మెడికల్ కళాశాల (డీఎంఈ)గా రూపుదిద్దుకోవడంతో ఇప్పటివరకు వైద్య విధాన పరిషత్ పరిధిలోకి ఉండబడిన నర్సంపేట ఆస్పత్రి డీఎంఈ కిందకు వచ్చింది. దీంతో వైద్య విధాన పరిషత్ పరిధిలో 20ఏళ్ల నుంచి ఔట్‌సోర్సింగ్‌పై 15మంది ఏఎన్ఎం, ఎల్‌టీ, ఎల్‌ఈ, డీఆర్‌పీ, ఎంఎన్‌వో, జేఎస్‌డబ్ల్యు, ఎస్‌జీ, వీసీపీ, ఈసీజీ తదితర విభాగాల్లో విధులను నిర్వర్తిస్తున్నారు. వీరిని ప్రతీ ఏడాది రెన్యువల్ చేస్తూ విధుల్లో కొనసాగించే వారు. వైద్య విధాన పరిషత్ నుంచి డీఎంఈ కిందకు ఆస్పత్రి నిర్వహణ రావడంతో సంబంధిత అధికారులు 15మంది ఉద్యోగుల రెన్యువల్ సమయం 2025, మార్చి 31తో ముగిసిందని, విధుల నుంచి తప్పుకోవాలని ఆదేశించడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లోకి వెళ్దామనుకున్నా నర్సంపేట నియోజకవర్గంలో ఎక్కడా సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులు లేకపోవడంతో వీరి పరిస్థితి తెగిన గాలిపటంలా మారింది. సంబంధిత శాఖ ఉన్నతాధికారులే 15మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు దారి చూపాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అకస్మాత్తుగా విధుల నుంచి తొలగింపు

ప్రతీ ఏడాది రెన్యువల్ ముగిసినా సంబంధిత ఉన్నతాధికారుల నుంచి రెన్యువల్ లెటర్ రావడానికి సమయం పట్టేదని, తాము విధులను కొనసాగించేవారమన్నారు. ప్రస్తుతం సమయం ముగిసిన రెండు రోజులకే విధుల నుంచి తొలగించడమేమిటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో విధులను నిర్వర్తించేవారమని, జాలీ, దయలేకుండా తప్పుకోవాలనడంతో తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు.



విధుల నుంచి తొలగించబడ్డ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి విధులు

కోవిడ్ సమయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రాణాలకు తెగించి విధులను నిర్వర్తించారు. ఎంతో మంది కరోనా బారినపడితే వారికి మనోధైర్యాన్ని కల్పించి వారి అండగా నిలిచారు.

డీఎంఈ పరిధిలో అవకాశం కల్పించేందుకు చర్యలు

డాక్టర్ మోహన్‌దాస్, ప్రిన్సిపాల్, నర్సంపేట మెడికల్ కళాశాల

ఇప్పటి వరకు వారంతా వైద్య విధాన పరిషత్ పరిధిలో పని చేశారు. ప్రస్తుతం జిల్లా మెడికల్ ఎడ్యుకేషన్ కింద ఆస్పత్రి రావడం, వారి రెన్యువల్ సమయం కూడా పూర్తయింది. ఐనప్పటికీ వారిని జిల్లా మెడికల్ కళాశాలలో విధులు నిర్వర్తించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించడం జరిగింది. ఉద్యోగులు రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంది.

మొండ్రాయి మాజీ సర్పంచ్ మృతి

సంగెం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొండ్రాయి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ విభాగం అధ్యక్షుడు పెండ్లి పురుషోత్తంరెడ్డి తల్లి, గ్రామ మాజీ సర్పంచ్ పెండ్లి కొమురమ్మ (60) గుండెపోటు తో శనివారం ఉదయం మృతిచెందారు. కొమురమ్మ 2013-18 కాలంలో గ్రామ సర్పంచ్ గా పనిచేశారు. అమె భర్త పెండ్లి కుమార స్వామి సైతం గ్రామ సర్పంచ్‌గా, ఎంపీటీసీగా పనిచేశారు. మృతు రాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, సమాచారం అందుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గ్రామంలోని మృతురాలి ఇంటికి వెళ్లి ఆమె మృతదేహానికి పూల మాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి, సంగెం మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, లక్కమారు కాపు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రాజమల్లు, రాష్ట్ర అధ్యక్షుడు గోనే శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూస రవీందర్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఏడాకుల మాల్లారెడ్డి, కోశాధికారి గోనే మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌లతో పాటు బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు మాజీ సర్పంచ్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



కొమురమ్మ(ఫైల్)

గుడుంబా అమ్మకాలపై దాడులు

ముగ్గురి అరెస్ట్

గీసుగొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గీసుగొండ, మనుగొండ, ఎలుకుర్తిలలో గుడుంబా స్థావరాలు, అమ్మక కేంద్రాలపై ఎక్సైజ్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించి ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సీఐ తాతారావు తెలిపిన వివరాల ప్రకారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశానుసారంగా మండలంలో స్పెషల్ డ్రైవ్ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా గుడుంబా అమ్ముతున్న గీసుగొండకు చెందిన పోలెపాక సబిత, కోట స్రవంతి, ఎలుకుర్తిలో బొడిగె దేవేంద్ర, బొల్లు సాంబలక్ష్మి, మనుగొండలో చెందిన ఎంబాడి మల్లమ్మలను అరెస్ట్ చేసి వారి నుంచి 25 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. దాడుల్లో ఎస్ఐ జ్యోతి, సిబ్బంది లక్ష్మణాచారి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గీతాకార్మికుడికి తీవ్ర గాయాలు

నెక్కొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండ్రపల్లికి చెందిన గీతాకార్మికుడు మేరుగు మల్లయ్య శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచిపడినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ ప్రమాదంలో మల్లయ్య తలకు, శరీరంలో పలు చోట్ల తీవ్ర గాయాలు తగలడంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మల్లయ్యకు భార్య మల్లికాంబ, కుమారుడు, కూతురు ఉన్నారు.

టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా

నాగార్జున్‌రెడ్డి, అశోక్

నెక్కొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నెక్కొండకు చెందిన చల్లా నాగార్జున్‌రెడ్డి, కోడూరి అశోక్‌కుమార్ హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన ఎన్నికలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర ఎన్నికల అధికారి ఎన్. నారాయణరెడ్డి తెలిపారు. రాష్ట్ర నాయకత్వం తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చెన్నారావుపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమీనాబాద్‌లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ సర్పంచ్ సిద్దెన రమేష్ శనివారం అందించారు. గ్రామానికి చెందిన ఊరగోండ లింగస్వామికి రూ.40వేలను, అర్ష నగేష్‌కు 60వేల చెక్కులను అందించారు. ఇటీవల వారు అనారోగ్యానికి గురికాగా ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం అందించారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు బండి హరీష్, చీర అశోక్, మురహరి రవి, మురహరి శంకర్, మొగులోతు దామోదర్, బానోతు రవి తదితరులు పాల్గొన్నారు.

అమర వీరుల త్యాగాలు వృథాకావు

దుగ్గొండి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నమ్మిన సిద్ధాంతం కోసం పని చేసి అమరులైన వారి త్యాగాలు వృథాకావని అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడు, సీపీఎం రాష్ట్ర నాయకుడు సారంపెల్లి మల్లారెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మంపేటలె సీపీఎం సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ గంగాడి చంద్రారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శనివారం సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా మల్లారెడ్డి పాల్గొని మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం గంగాడి చంద్రారెడ్డి పని చేశారని, ప్రజల భాగస్వామ్యంతో సర్పంచ్‌గా గెలిచి సేవలందించారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈసంపెల్లి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సమ్మయ్యనాయక్, కొరబోయిన కుమారస్వామి, హన్మకొండ శ్రీధర్, నమిండ్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

వర్ధన్నపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట పట్టణానికి చెందిన కొడాటి దేవేందర్‌రావు తల్లి కౌసల్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు అరూరి రమేష్ సందర్శించి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ రాజమణి చెల్లెలు అత్త జూలురు సరోజన అనారోగ్యంతో మృతి చెందగా అమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

నర్సంపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మహనీయుడు జగ్జీవన్‌రామ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమస్యల పరిష్కారానికి అంబేద్కర్ నగర్‌కాలనీ వాసులు ఉద్యమించాలని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా నాయకుడు ఈర్ల పైడి పిలుపు నిచ్చారు. పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎంఎస్పీ, డీబీడీపీఎస్ ఆధ్వర్యంలో గుడిసెవాసులు చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 12వ రోజుకు చేరాయి. కార్యక్రమంలో రాంజీ, స్వామి, మల్లయ్య, వేణు, సారమ్మ, సరోజన, స్వరూప, జయ, శారద, శ్రీకాంత్ చారి, సుధాకర్, రాములు, సంధ్యారాణి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు ఆదర్శంగా తీసుకోవాలి

వర్ధన్నపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ జగ్జీవన్‌రామ్ 117 జయంతి వేడుకలను పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు అరూరి రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల రహిత సమాజం కోసం పాటు పడిన బడుగుబలహీన వర్గాల నేత దేశ స్వాతంత్ర్యం కోసం, సామాజిక సమానత్వం కోసం పోరాడిన ధీరుడని కొనియాడారు. కార్యక్రమంలో మార్గం భిక్షపతి, సిలువేరు కుమారస్వామి, గాడిపల్లి రాజేశ్వర్‌రావు, పెద్దూరి రాజ్‌కుమార్, తుమ్మల శ్రీధర్, కొండేటి సత్యం తదితరులు పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జక్కి శ్రీకాంత్, జన్ను నర్సయ్య, మచ్చ రాజు, చెన్నయ్య యాదవ్, నందిపాక భాస్కర్, చంద్రమౌళి, బాబు, జంగిలి భాస్కర్, రాజు పాల్గొన్నారు.

● నర్సంపేట (ఆంధ్రజ్యోతి) : భారతదేశ మాజీ ఉప ప్రధాని, దళితుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘ సంస్కర్తని దళిత ప్రజా సంఘాల కన్వీనర్ గద్ద వెంకటేశ్వర్లు, కో-కన్వీనర్లు కల్లెపెల్లి ప్రణయదీప్, గుంటి వీరప్రకాశ్, తడుగుల విజయ్‌కుమార్, జనగాం కుమారస్వామి, అందె రవి అన్నారు. పట్టణంలో జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ జీవితాన్ని ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బోయిని నారాయణ, ఉపాధ్యాయులు సాంబయ్య, గిరగాని శ్రీనివాస్, నాయకులు మాదాసి సదానందం, కరుణాకర్, నవీన్, రాజు, మాలమహానాడు నాయకుడు అశోక్ పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని వరంగల్ రోడ్‌లోని జంక్షన్ వద్ద జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరె పల్లి బాబు, జిల్లా అధ్యక్షుడు మైసి శోభన్. పట్టణ అధ్యక్షుడు చిలక బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా డీబీఆర్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మడి బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● సంగెం (ఆంధ్రజ్యోతి): దేశ ఉప ప్రధాని, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు సంగెం మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి పూల మాల లు వేసిన అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మెట్టుపల్లి సునీల్, మాజీ సర్పంచ్ గుండేటి బాబు, శేఖర్, ఏలియా, కొడూరి సదయ్య, ఆగపాటి రాజు, మెట్టుపల్లి బాబు, స్వామి పాల్గొన్నారు.

● నల్లబెల్లి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండు వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని దళిత నాయకు లు శనివారం ఘనంగా జరిపారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో భట్టు సాంబయ్య, బొట్ల నరేష్‌లు మాట్లాడగా, నాయకులు బొట్ల ప్రతాప్, రాజుకుమార్, బొట్ల రాజు, సారంగపాణి, చిన్నికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● రాయపర్తి (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేష న్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతాకుల రంగారెడ్డి, రాష్ట్ర ఎస్సీయూనియన్ ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్ నాయక్, మండల అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడి పాల్గొన్నారు.

● నెక్కొండ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో డాక్టర్ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ జీవిత చరిత్రపై ఉపన్యాస పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఈదునూరి వెంకన్న మాట్లాడగా, నాయకులు ఈదునూరి వెంకటేశ్వర్లు, శంకర్, ప్రభాకర్, యాకోబ్, కార్తీక్, వెంకటాద్రి, లక్ష్మన్, యాకయ్య, ప్రశాంత్, సంజీవ్, శ్యాం పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్

శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి..

(5వ పేజీ తరువాయి)

నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశీయ ధర్మకర్త చెరకుపెల్లి నర్సింహాచార్యులు చెప్పారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక షామియానాల కింద విశాల వేదికపై కల్యాణం నిర్వహిస్తామన్నారు. హనుమకొండలోని గుడిబండల్ శ్రీవెంకటేశ్వరాలయంలో ఈసారి కల్యాణోత్సవాన్ని భద్రాచల సమయంలోనే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, ప్రధాన అర్చకుడు కలకోట శ్రీనివాసాచార్య తెలిపారు. ఆలయ చైర్మన్ పులి విక్రమ్‌కుమార్ ఆధ్వర్యంలో సాయంత్రం స్వామి వారిని ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. హనుమకొండ చౌరస్తాలోని శివశక్తి స్థల్‌లో నిర్వహించే శ్రీరామనవమి వేడుకలకు ఆలయ ఉత్సవ సమితి ప్రత్యేక ఆహ్వాన పత్రికలను ముద్రించి ఇంటింటికి పంపడం విశేషం. ములుగురోడ్‌లోని గురుధామంలో శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాలను నిర్వహించి అనంతరం పెద్ద ఎత్తున భక్తులకు మహా ప్రసాద వితరణ చేస్తాని ఆటయ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ చెప్పారు. హనుమకొండ లష్కర్ బజార్‌లోని రామ్‌మందిర్‌లో ఆదివారం మధ్యాహ్నం శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఘనశ్యామ్ శర్మ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు టీటీడీ మేనేజర్ కనపర్తి రఘువీర్ తెలిపారు. అదే విధంగా హనుమకొండ అదాలత్ సమీపంలోని శ్రీభూనీలా సమేత వెంకటేశ్వర ఆలయంలో కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ నిర్వాహకులు చెప్పారు. శనివారం ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకుడు దేశికన్ స్వామి సంప్రదాయంగా సంప్రోక్షణ చేసి ఎదుర్కోలు ఉత్సవాలకు సిద్ధంగా చేశారు. విద్యానగర్ కాలనీలోని విజయ గణపతి ఆలయంలో జరిగే శ్రీరామ నవమి వేడుకలను శనివారం సాయంత్రం ఈ ప్రాంతానికి చెందిన ఇరిగేషన్ సీఈ వెంకటకృష్ణ-మాధవి దంపతులు రాముడిని పెళ్లి కొడుకుగా ముస్తాబుచేసి ఎదుర్కోలు ఉత్సవానికి తీసుకెళ్లారు. అదే విధంగా ఎన్‌జీవోస్ కాలనీ రోడ్‌లోని శ్రీలక్ష్మీ నగర్ కాలనీలో, పోస్టల్ కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయంలో, షిరిడీ సాయిబాబా ఆలయంలో, ఎక్సైజ్ కాలనీ వెంకటేశ్వర ఆలయంలో, ఏకశిలా పార్కు సమీపంలోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం



మాట్లాడుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రాయపర్తి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అర్హు లైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ను అందిస్తామని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చెప్పారు. శనివారం మండల కేం ద్రంలోని రైతు వేదికలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పేదలు కార్పొరేట్ వైద్యం పొందేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా వేలాది కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నదన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదల సంక్షే మ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వర్ధన్నపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యా నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తొలగించిన అధికారులు

దుగ్గొండి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపేటలోని ఒడ్డెర కాలనీలో కొంతకాలంగా ఇండ్లపై 11కేవీ విద్యుత్ తీగలు వెళ్లడంతో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో విద్యుత్ అధికారులు శనివారం తొలగించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇళ్లపైనుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు తొలగించాలని సభలో విన్నవించారు. అందుకుగాను ప్రభుత్వం ప్రత్యేక చొరవతో ప్రమాదంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించి ప్రత్యామ్నాయంగా స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశాలు రావడంతో అధికారులు ఇళ్లపై వెళ్తున్న తీగలు తొలగించినట్లు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రొట్టె రమేశ్ వెల్లడించారు. దీంతో కొంత కాలంగా విద్యుత్ తీగలతో భయందోళన ఉన్న కాలనీ వాసులు ఆనందం వ్యక్తపరిచారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నర్సంపేట, ఏ ప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని ఏఐకెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దెబ్బ తిన్న పంటలను వ్యవసాయశాఖాధికారులచే సర్వే నిర్వహించి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల వంతున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో ఈ నెల 7, 8 తేదీల్లో ఏఐకెఎఫ్ జాతీయ సమావేశాలు జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశాలకు తెలంగాణ నుంచి తనతో పాటు సంఘం గౌరవ అధ్యక్షుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వరికుప్పల వెంకన్న, గిరిజన రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ తుకారాం నాయక్ వెళ్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

నెక్కొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. నెక్కొండ వ్యవసాయ మార్కెట్‌లో విక్రయానికి తీసుకువచ్చిన వేల క్వింటాళ్ల మొక్కజొన్నలు అకాల వర్షంలో తడవడంతో శనివారం బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి మార్కెట్ ఆవరణలో పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, నియోజకవర్గం నాయకులు కొమ్ము రమేష్, మాజీ ఎంపీపీ జాటోతు రమేష్, మాజీ సొసైటీ చైర్మన్లు మారం రాము, కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, కొణిజెట్టి భిక్షపతి, తాటిపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం పుస్తకావిష్కరణ సభ

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ కవులు, రచయితలు కాసుల రవికుమార్, మల్లవరపు ప్రభాకరావు, డాక్టర్ నూకతోటి రవికుమార్, మేడిపల్లి అజయ్‌లు సంయుక్తంగా రాసిన ప్రయాణం పుస్తకాన్ని శనివారం నర్సంపేట పట్టణంలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ జగదీశ్వర్ మాట్లాడుతూ ఇది ఒక వినూత్నమైన ప్రయోగమని, తెలుగు సాహిత్యంలో నిలిచి పోయే పుస్తకమవుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రెడ్డప్ప, జావెద్, పెండెం భాస్కర్, రఘుపతి, పాష, కొర్ర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి ముస్తాబైన ఆలయాలు

నెక్కొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నేడు సీతారాములస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుటకు మండలంలోని పలు దేవాలయాల ఆవరణలో శనివారం చలువ పందిళ్లను వేసి, కల్యాణ మండపాలకు రంగులు వేసి, విద్యుత్ కాంతులతో అందంగా ముస్తాబు చేశారు. నెక్కొండలోని రామలింగేశ్వరస్వామి, అంజనేయస్వామి, పంచముఖ ఆంజనేయస్వామి, పత్తిపాక, తోపనపల్లి, అలంకానిపేట, పెద్దకొర్పోలు, దేవునితండాలోని దేవాలయాలను ముస్తాబులు చేశారు. ఆలయ కమిటీల చైర్మన్‌లు కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, బెజ్జంకి వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి సంపత్‌రావులు ఆధ్వర్యలో ఏర్పాట్లు చేశారు. అలాగే బొల్లికొండ గుట్టపై కల్యాణం సందర్భంగా జరిగే జాతర ఏర్పాట్లను సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేందర్ పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా చూడాలని నిర్వహకులకు సూచించారు.

● చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని సీతారామంజనేయ స్వామి ఆలయాన్ని శనివారం సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయంలోని శ్రీరామ నవమి వేడుకల ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో ఆవరణలో చలువ పందిళ్లను వేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగు నీటి సౌకర్యం కల్పించటంతో పాటు ఆలయానికి రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.